**నేటి కందం-నేటికి అందం**

వేలాది కోట్ల రూకలు
మేలగు సదుపాయతతులు మించిన రీతిన్
"ఖేలో భారత్" నందున
తాలిమితో నాడెడి యువతకు కేంద్ర మిడెన్ !!

(ముప్పై ఆరు వేల కోట్ల రూపాయలతో "ఖేలో భారత్" పథకం కింద క్రీడా రంగంలో యువతకు శిక్షణ సదుపాయాలు అవకాశాలు ప్రోత్సాహకాలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనివలన దేశంలోని యువత చాలా ఉత్సాహంతో ముందుకు దూసుకుపోతున్నారు.)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com   ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433   E-mail:netinijam93@gmail.com

**చురక**

ఫీజు రీఎంబర్సుమెంటు
పీటముడి ఇన్నాళ్లు
విప్పకుంటే ప్రభుత్వాలు
విద్యార్థుల కన్నీళ్లు.
కాలేజీ యజమానుల
కాల్చి పెట్టే తిప్పలు
చదువు కొనలేని శక్తి
సామాన్యులే కుప్పలు



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ ఆదివారం 2-8-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:282 పేజీలు:6 వెల: రూ.1/-


# చిన్నసూరారంలో మంత్రి కోమటిరెడ్డి పర్యటన



నల్గొండ, ఆగష్టు 1:నల్గొండ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శనివారం ప్రారంభించారు. మండలంలోని చిన్నసూరారం హామ్లెట్ గ్రామం పావురాలగూడెంలో రూ.1.35 కోట్ల వ్యయంతో నిర్మించిన పీడబ్ల్యూడీ సీసీ రోడ్డును మంత్రి ప్రారంభించారు. అనంతరం గ్రామంలో పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలంటే ఉపాధి అవకాశాలు పెరగాలని పేర్కొన్న మంత్రి, చిన్నసూరారంలో మహిళా సంఘాల కోసం వేర్‌హౌస్ లేదా రైస్‌మిల్ ఏర్పాటు చేసేందుకు 5 నుంచి 10 ఎకరాల స్థలాన్ని గుర్తించాలని అధికారులను ఆదేశించారు. మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారికి సూచించారు. పావురాలగూడెంలో చౌకధర దుకాణం లేక ప్రజలు చిన్నసూరారం వరకు వెళ్లి రేషన్ తీసుకురావాల్సి వస్తోందని స్థానికులు మంత్రి దృష్టికి తీసుకురాగా, వెంటనే గ్రామంలో చౌకధర దుకాణాన్ని మంజూరు చేసి డీలర్‌ను నియమించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, ఆర్డీఓ వై. అశోక్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ పి. మోహన్, పంచాయతీరాజ్ ఈఈ గిరిధర్, మాజీ జెడ్పీటీసీ లక్ష్మయ్య, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలు ధనలక్ష్మి, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మంగపేట మండలంలో సీతక్క పర్యటన

## -వరద పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచన



ములుగు, ఆగష్టు 1: (నేటినిజం ప్రతినిధి)ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క వరద పరిస్థితులను సమీక్షించారు. బ్యాక్‌వాటర్ ప్రభావంతో ముంపు ముప్పు ఉన్న ప్రాంతాల ప్రజలకు కల్పిస్తున్న సహాయక చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

మంగపేట మండలంలో గోదావరి వరద ప్రవాహాన్ని పరిశీలించిన మంత్రి, అనంతరం పునరావాస కేంద్రాన్ని సందర్శించి బాధిత కుటుంబాలతో మాట్లాడారు. బ్యాక్‌వాటర్ ప్రభావంతో ముంపు ముప్పు ఉన్న ప్రాంతాలకు చెందిన 28 కుటుంబాల 112 మందిని సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించినట్లు అధికారులు మంత్రికి వివరించారు.

పునరావాస కేంద్రాల్లో బాధితులకు ఆహారం, స్వచ్ఛమైన తాగునీరు, వైద్య సేవలు, పారిశుద్ధ్య సౌకర్యాలు ఎలాంటి లోటు లేకుండా అందించాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ప్రజలకు అవసరమైన అన్ని సహాయ చర్యలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని సూచించారు.

ఎగువ ప్రాంతాల్లో ఇంకా భారీ వర్షాలు కురుస్తున్నందున గోదావరి వరద మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్న మంత్రి, నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. అనంతరం వాజేడు వద్ద గోదావరి వరద ఉధృతి తగ్గి ప్రజలు క్షేమంగా ఉండాలని ఆకాంక్షిస్తూ మంత్రి సీతక్క ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# డిజిటల్ బాటలో వ్యవసాయ మార్కెట్లు

## -అధికారులకు మంత్రి సూచనలు

హైదరాబాద్, ఆగష్టు 1:రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖను పూర్తిస్థాయిలో డిజిటలీకరించి పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దాలని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మార్కెటింగ్ శాఖ పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలు, పత్తి కొనుగోళ్ల సన్నద్ధత, మార్కెట్ యార్డుల అభివృద్ధిపై శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు.

మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని 206 మార్కెట్ కమిటీలను పూర్తిస్థాయిలో ఆటోమేషన్ చేయాలని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికలు, టెండర్ ప్రక్రియలను ఆగస్టు నెలాఖరులోగా పూర్తి చేసి, సెప్టెంబర్ నుంచి అమలు ప్రారంభించాలని సూచించారు.

ప్రతి మార్కెట్ యార్డులో సీసీ కెమెరాలు, ఎలక్ట్రానిక్ వెయింగ్ స్కేల్స్, గేట్ ఎంట్రీ?ఎగ్జిట్ వ్యవస్థలను ఒకే డిజిటల్ ప్లాట్‌ఫారంపై అనుసంధానం చేయాలని ఆదేశించారు. రవాణా శాఖలో అమలవుతున్న నంబర్ ప్లేట్ స్కానింగ్ విధానాన్ని మార్కెట్ యార్డుల్లోనూ అమలు చేసి, వాహనాల ప్రవేశం, నిష్క్రమణ, తూకం, కొనుగోలు లావాదేవీలన్నీ డిజిటల్ రూపంలో నమోదు అయ్యేలా సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేయాలని సూచించారు. ఇకపై మార్కెటింగ్ శాఖలో జరిగే అన్ని కొనుగోళ్లు పూర్తిగా డిజిటల్ విధానంలోనే నిర్వహించాలని స్పష్టం చేశారు.

రానున్న పత్తి కొనుగోలు సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ముందస్తు సన్నద్ధత అవసరమని మంత్రి పేర్కొన్నారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ), జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు, సంబంధిత అధికారులతో ఆగస్టు తొలి లేదా రెండో వారంలో సమావేశం నిర్వహించాలని ఆదేశించారు.

# విదేశీ పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి

**-ఆగష్టు 20 నుంచి సెప్టెంబర్ 8 వరకు అమెరికా, యూకే సహా పలు దేశాల్లో పర్యటన**
**-పారిశ్రామిక దిగ్గజాలు, గ్లోబల్ ఇన్వెస్టర్లతో భేటీలు..**
**-సెప్టెంబరు మూడో వారంలో అసెంబ్లీ సమావేశాల అవకాశం**



హైదరాబాద్, ఆగష్టు 1:తెలంగాణకు భారీ పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి విదేశీ పర్యటనకు సిద్ధమవుతున్నారు. ఆగస్టు 20 నుంచి సెప్టెంబర్ 8 వరకు దాదాపు 20 రోజులపాటు అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)తో పాటు మరికొన్ని కీలక దేశాల్లో ఆయన పర్యటించే అవకాశాలు ఉన్నట్లు అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. కంపెనీల ప్రతినిధుల అపాయింట్‌మెంట్లను బట్టి తుది షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఈ పర్యటనలో ప్రపంచ ప్రఖ్యాత కంపెనీల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, గ్లోబల్ పెట్టుబడి సంస్థలు, ప్రవాస భారతీయులతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. ముఖ్యంగా ఐటీ, కృత్రిమ మేధ (ఏఐ), డేటా సెంటర్లు, సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ, లైఫ్ సైన్సెస్, ఫార్మా, గ్రీన్ ఎనర్జీ, ఏరోస్పేస్, రక్షణ తయారీ వంటి వ్యూహాత్మక రంగాల్లో పెట్టుబడులను తెలంగాణకు రప్పించడమే ఈ పర్యటన ప్రధాన లక్ష్యంగా భావిస్తున్నారు.

అమెరికా పర్యటనలో చిప్ తయారీ, క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ రంగాలకు చెందిన ప్రముఖ సంస్థల ప్రతినిధులతో సమావేశాలు జరిగే అవకాశం ఉంది. అలాగే లండన్‌లో గ్లోబల్ ఫైనాన్షియల్ ఇన్వెస్టర్లు, విద్యాసంస్థల ప్రతినిధులతో చర్చలు నిర్వహించే అవకాశముందని సమాచారం.

గత విదేశీ పర్యటనల్లో తెలంగాణ ప్రభుత్వం కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాల (ఎంఓయూలు) అమలు పురోగతిని కూడా ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సమీక్షించే అవకాశముంది. ఇప్పటికే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టిన లేదా ఆసక్తి చూపుతున్న అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతోనూ ఆయన భేటీ కానున్నట్లు తెలుస్తోంది.

సెప్టెంబరు మూడో వారంలో అసెంబ్లీ సమావేశాలు

మరోవైపు, వర్షాకాల అసెంబ్లీ సమావేశాలను సెప్టెంబరు మూడో వారంలో వారం రోజులపాటు నిర్వహించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాల్లో చర్చ జరుగుతోంది. చట్టసభల్లో పోటీ చేసే కనీస వయోపరిమితిని 25 నుంచి 21 సంవత్సరాలకు తగ్గించాలని కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేయనున్నట్లు ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ అంశంపై ఆగస్టు మధ్యలో ప్రత్యేక సమావేశం నిర్వహించే అవకాశాలపైనా ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

విదేశీ పర్యటన ముగించుకుని ముఖ్యమంత్రి సెప్టెంబరు రెండో వారంలో రాష్ట్రానికి చేరుకోనున్న నేపథ్యంలో, అనంతరం అసెంబ్లీ సమావేశాలను నిర్వహించే దిశగా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

# కార్పొరేట్ పాలనకు కంపెనీ సెక్రటరీలే కీలకం: శ్రీధర్ బాబు




హైదరాబాద్, ఆగష్టు 1:కార్పొరేట్ పాలనను బలోపేతం చేయడంలో, పారదర్శకతను పెంపొందించడంలో, నిబంధనల అమలును నిర్ధారించడంలో, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచడంలో కంపెనీ సెక్రటరీల పాత్ర ఎంతో కీలకమని రాష్ట్ర సమాచార సాంకేతిక, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. హైదరాబాద్‌లోని కొండాపూర్ తెలంగాణ కాంట్రాక్టర్స్ కల్చరల్ క్లబ్‌లో ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన 50వ దక్షిణ భారత ప్రాంతీయ కంపెనీ సెక్రటరీల సదస్సు?2026ను మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు.

ఈ సందర్భంగా దక్షిణ భారత రాష్ట్రాల నుంచి హాజరైన 700 మందికిపైగా కంపెనీ సెక్రటరీలను ఉద్దేశించి మంత్రి ప్రసంగించారు. కార్పొరేట్ రంగంలో సుస్థిర అభివృద్ధికి, పారదర్శక పాలనకు, పెట్టుబడిదారుల నమ్మకాన్ని పెంపొందించేందుకు కంపెనీ సెక్రటరీలు చేస్తున్న సేవలను ఆయన ప్రశంసించారు. తెలంగాణ ప్రభుత్వం పారదర్శకత, జవాబుదారీతనం, పెట్టుబడిదారులకు అనుకూలమైన వ్యాపార వాతావరణం కల్పించేందుకు కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. సుస్థిర ఆర్థికాభివృద్ధిని సాధించడంతో పాటు రాష్ట్రానికి మరిన్ని దేశీయ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించే దిశగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. సదస్సులో పాల్గొన్న ప్రతినిధులందరికీ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి, ఈ సమావేశం విజ్ఞానాన్ని పెంపొందించే, అనుభవాలను పంచుకునే, వృత్తిపరంగా మరింత అభివృద్ధికి దోహదపడే వేదికగా నిలవాలని ఆకాంక్షించారు.

# కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు.



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 1:(నేటినిజం ప్రతినిధి): వేములవాడలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో ఫ్రెండ్‌షిప్ డే వేడుకలను ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకుని స్నేహం యొక్క గొప్పతనాన్ని చాటిచెప్పారు. స్నేహం, ఐక్యత, పరస్పర సహకారం అనే అంశాలపై ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సరదా ఆటలు నిర్వహించారు. ఉపాధ్యాయులు మంచి స్నేహితుడి లక్షణాలు, నిజాయితీ, పరస్పర గౌరవం మరియు బాధ్యత గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ వెంకటేష్ మాట్లాడుతూ, "స్నేహం అనేది జీవితాంతం నిలిచే అమూల్యమైన బంధం. మంచి స్నేహితుడు మన వ్యక్తిత్వ వికాసానికి బలమైన ఆధారం. విద్యార్థులు ఒకరినొకరు గౌరవిస్తూ, సహకరిస్తూ, మంచి విలువలతో ఎదగాలి" అని తెలిపారు. పాఠశాల డైరెక్టర్ శ్రీ సన్నిధి వెంకట కృష్ణ మాట్లాడుతూ, "విద్య అనేది కేవలం పుస్తకాలకే పరిమితం కాదు. స్నేహం, సహకారం, నాయకత్వం, పరస్పర గౌరవం వంటి విలువలను విద్యార్థుల్లో పెంపొందించడం కూడా విద్యాసంస్థల ప్రధాన బాధ్యత అని అన్నారు.. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఫ్రెండ్‌షిప్ డే వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.

# భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించిన ప్రధాని మోదీ



అమరావతి, ఆగష్టు 1: ఆంధ్రప్రదేశ్‌లోని భోగాపురంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించారు. అనంతరం జాతికి అంకితం చేశారు. రాష్ట్ర విభజన అనంతరం నిర్మితమైన తొలి అంతర్జాతీయ విమానాశ్రయంగా గుర్తింపు పొందిన ఈ ప్రాజెక్టు ఉత్తరాంధ్ర అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలవనుందని భావిస్తున్నారు.

ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు, కేంద్ర సహాయ మంత్రులు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు, జీఎంఆర్ గ్రూపు ఛైర్మన్ జి. మల్లిఖార్జునరావు, బిజినెస్ ఛైర్మన్ జీబీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవం సందర్భంగా విమానాశ్రయంలోని ప్రయాణికుల టెర్మినల్‌ను సీఎం చంద్రబాబుతో కలిసి ప్రధాని మోదీ సందర్శించి ఆధునిక సదుపాయాలను పరిశీలించారు. చెక్-ఇన్ హాల్, సాంకేతిక వ్యవస్థలు, టెర్మినల్ రూపకల్పన, ప్రయాణికులకు కల్పించిన వసతులపై జీఎంఆర్ ప్రతినిధులు ఆయనకు వివరించారు.

థింసా నృత్యంతో విశేష స్వాగతం

ప్రధాని రాక సందర్భంగా గిరిజన సంస్కృతిని ప్రతిబింబించే థింసా నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, పోలవరం ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజన మహిళలు, విద్యార్థినులు, మహిళా సంఘాల సభ్యులు కలిపి 13,750 మంది కళాకారులు ఒకేసారి థింసా నృత్యం ప్రదర్శించి ప్రధానికి ఘన స్వాగతం పలికారు. ఓపెన్ టాప్ జీపులో సభా వేదికకు వెళ్తూ ప్రధాని ఈ ప్రదర్శనను తిలకించారు.

భోగాపురం విమానాశ్రయం ప్రారంభంతో ఉత్తరాంధ్రలో పారిశ్రామిక, పర్యాటక, వాణిజ్య, ఎగుమతుల రంగాలకు కొత్త ఊపు లభించనుంది. ముఖ్యంగా ఫార్మా, ఆక్వా, సముద్ర ఉత్పత్తుల ఎగుమతులకు ఈ విమానాశ్రయం కీలక కేంద్రంగా మారనుంది. ప్రత్యక్షంగా 15 వేల మందికి, పరోక్షంగా 5.85 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు అంచనా.

అత్యాధునిక సదుపాయాలతో నిర్మాణం

రూ.4,750 కోట్ల వ్యయంతో 2,203 ఎకరాల విస్తీర్ణంలో ఈ విమానాశ్రయాన్ని నిర్మించారు. తొలి దశలో ఏడాదికి 60 లక్షల మంది ప్రయాణికులకు సేవలందించే సామర్థ్యం ఉండగా, రెండో దశలో 1.20 కోట్లు, మూడో దశలో 1.80 కోట్ల మంది ప్రయాణికులకు సేవలందించేలా విస్తరించనున్నారు.

భారీ ఎయిర్‌బస్, బోయింగ్ విమానాలు దిగేందుకు 3.8 కిలోమీటర్ల పొడవు, 45 మీటర్ల వెడల్పుతో రెండు రన్‌వేలు నిర్మించారు. 25 వేల టన్నుల వార్షిక సామర్థ్యంతో కార్గో టెర్మినల్, లాజిస్టిక్స్ జోన్, 55 మీటర్ల ఎత్తులో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్, 25 ఎకరాల్లో విమానాల మరమ్మతుల (ఎంఆర్‌వో) కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

సంస్కృతి ప్రతిబింబించే టెర్మినల్

సముద్ర తీర ప్రాంతానికి అనుగుణంగా ఎగిరే చేప ఆకృతిలో టెర్మినల్‌ను రూపకల్పన చేశారు. టెర్మినల్ సీలింగ్‌పై సంప్రదాయ ముగ్గులు, నాదస్వరం థీమ్‌లతో అలంకరించారు. స్వాగత ద్వారం వద్ద ఏటికొప్పాక బొమ్మను ఏర్పాటు చేయగా, లోపల తోలుబొమ్మలాట, బొబ్బిలి వీణ, బంగినపల్లి మామిడి, అరసవల్లి, శ్రీకూర్మం, సింహాచలం, కనకమహాలక్ష్మి ఆలయం, థింసా నృత్యం వంటి ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించే కళాఖండాలతో టెర్మినల్‌ను తీర్చిదిద్దారు.

# అజిత్ దోవల్‌కు లోకమాన్య తిలక్ అవార్డు




పుణె, ఆగష్టు 1: జాతీయ భద్రత సలహాదారు అజిత్ దోవల్ కు .. ఇవాళ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా.. లోక్‌మాన్య తిలక్ జాతీయ అవార్డును అందజేశారు. పుణెలో ఆ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలగంగాధర్ తిలక్ 106వ వర్ధంతి సందర్భంగా అవార్డును అందజేశారు. లోక్‌మాన్య తిలక్ స్మారక్ ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ రోహిత్ తిలక్ మాట్లాడుతూ.. దేశ భద్రతకు, కౌంటర్ టెర్రరిజం ఆపరేషన్స్‌కు, బోర్డర్ సెక్యూర్టీకి పాల్పడుతున్న అజిత్ దోవల్‌కు అందజేసినట్లు చెప్పారు. మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్, డిప్యూటీ సీఎం ఏకనాథ్ షిండే, డిప్యూటీ సీఎం సునేత్ర పవార్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. లోక్‌మాన్య తిలక్ జాతీయ అవార్డులో భాగంగా ఓ మెమొంటో, ప్రశంసా పత్రం, లక్ష క్యాష్ ప్రైజ్ ఇస్తారు.

తమకు చెందిన రంగాల్లో దేశాన్ని అత్యున్నత స్థాయిలో నిలిపిన వారికి ప్రతి ఏడాది ఈ అవార్డును అందజేస్తారు. దేశ ప్రయోజనాల రక్షణ కోసం సేవ చేసిన అజిత్ దోవల్‌ను ఈ ఏడాది అవార్డు కోసం ఎంపిక చేశారు. ఇంటెలిజెన్స్, నేషనల్ సెక్యూర్టీ అంశంలో అజిత్ దోవల్ సుదీర్ఘ కెరీర్ ఉన్నది. ఆపరేషన్ బ్లాక్ థండర్, డోక్లామ్ దౌత్య చర్చలు, బాలాకోట్ వైమానిక దాడుల్లో అజిత్ దోవల్ పాత్ర కీలకమైంది. 1968 నాటి కేరళ కేడర్‌కు చెందిన ఐపీఎస్ ఆఫీసర్ ఆయన. మూడు దశాబ్దాల పాటు భారత ఇంటెలిజెన్స్‌లో పనిచేశారు. ఆ తర్వాత ఆయన ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్‌గా ఉన్నారు. మిజోరం, సిక్కిం, పంజాబ్, జమ్మూకశ్మీర్ లాంటి సున్నిత ప్రదేశాల్లో ఆయన పనిచేశారు. దీంతో పాటు ఇస్లామాబాద్, లండన్ పట్టణాల్లోనూ చేశారు. ప్రస్తుతం దోవల్ వయసు 81 ఏళ్లు. నేషనల్ సెక్యూర్టీ అడ్వైజర్‌గా సుదీర్ఘ కెరీర్‌లో కొనసాగుతున్నారు.

# స్నేహాని కన్న మిన్న లోకాన లేదురా !

## (02 ఆగస్టు "జాతీయ స్నేహ దినోత్సవం" సందర్భంగా)

స్నేహం అంటే ఓ త్యాగం, ఆపదలో అభయ హస్తం, కష్టాల్లో ఓ శీతల నేస్తం, ఆపదలో సాంత్వన నీడను చేకూర్చే మహా వృక్షం. ప్రాణ స్నేహితులకు ప్రత్యామ్నాయం ఉండదు. స్నేహం చేయని మనిషి ఉండడు. స్నేహితులు లేని తనువు ఉండదు. ప్రతి వ్యక్తి జీవితంలో స్నేహానికి ఓ ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. స్నేహితుల హస్తాలు నిస్వార్ధ నేస్తాలు. బంధువులతో లేని ఓ అపురూపమైన అనుబంధం స్నేహితులతో ఉంటుంది. కొన్ని సమయాల్లో కుటుంబ సభ్యులతో పంచుకోలేని విషయాలను సహితం స్నేహితులతో పంచుకుంటాం. మనకు స్నేహితులు అనేకులు ఉండవచ్చు కాని ప్రాణ మిత్రులు కొద్ది మంది మాత్రమే ఉంటారు. ప్రాణ స్నేహితులతో మనం అన్ని విషయాలను దాపరికం లేకుండా పంచుకుంటాం. మనసుకు ప్రశాంతత, శరీరానికి ఉపశమనం కలిగిస్తుంది స్నేహ హస్తం. సహానుభూతికి ఓ చక్కని ఉదాహరణ స్నేహం. పరస్పర గౌరవానికి, త్యాగానికి చిరునామా ఫ్రెండ్‌షిప్. సన్నిహిత మిత్రుడు అంటే ఓ మహా నమ్మకం. స్నేహానికి వయోభేదం లేదు. చంటి వాడి నుంచి పండు ముసలి వరకు అందరికీ స్నేహితులు ఉంటారు, వద్దన్నా ఆనందాలను వడ్డిస్తూ ఉంటారు.

**జాతీయ స్నేహ దినోత్సవం-2026 :**

స్నేహం విలువను తెలుసుకోవడం, మంచి స్నేహితులతో సంబంధాలు కొనసాగించడం, అపార్థాలను నివృత్తి చేసుకొని స్నేహాన్ని కొనసాగించడం, బేధభిప్రాయాలను దూరం చేసుకోవడం, పౌర సమాజంలో శాంతి పందిరి వేయడానికి అనుకూలమైన అనువైన సందర్భంగా ప్రతి ఏట ఆగస్టు మాసంలోని మొదటి ఆదివారం రోజు, అనగా 02 ఆగస్టు 2026న భారతదేశవ్యాప్తంగా "జాతీయ స్నేహ దినోత్సవం (నేషనల్ ఫ్రెండ్‌షిప్ డే)" పాటించడం కొనసాగుతున్నది. 2026 జాతీయ స్నేహ దినం వేదికగా స్నేహ మార్గం ద్వారా శాంతి, సంఘీభావం, సంస్కృతుల మధ్య అవగాహనలను పెంపొందించే ప్రయత్నాలు నిర్వహించాలి. వివిధ దేశాలు, జాతులు, మతాలు, కులాలు, అసమానతలను మరిచి అందరం స్నేహ బంధంతో ఏకం కావడమే లక్ష్యంగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటాం. స్నేహ బందం పరమ పవిత్రమైనది. నిజమైన స్నేహితుల మధ్య విడదీయరాని ప్రేమ అనే అభేద్య బంధం పెనవేసుకొని ఉంటుంది. మంచి స్నేహితులు కొన్ని విషయాల్లో విభేదించినా, సదా ఒక్కటిగానే ఉంటారు.

**స్నేహితులతో కొత్త ప్రపంచం పరిచయం :**

చిన్ననాడే స్నేహం అనే బంధం మొలకెత్తుతుంది. అమ్మనాన్న తర్వాత మన సంక్షేమాన్ని, శ్రేయస్సును నిస్వార్థంగా తలుస్తూ మన వెంట నడిచే వ్యక్తులు మన ప్రాణ మిత్రులు మాత్రమే. బడికి వెళ్లడంతో మనకు నూతన స్నేహితులు పుడతారు. వారితోనే మన దినచర్య ముడిపడి ఉంటుంది. చదవడం, ఆడడం, పాడడం, మాట్లాడుకోవడం, సరదాగా తిరగడం లాంటివి మన ప్రాణ స్నేహితులతోనే ముడిపడి ఉంటాయి. ఒకే కంచంలో తిని ఒకే మంచంలో పడుకునే స్థాయికి స్నేహం ఎదుగుతుంది. వయస్సు పెరిగిన కొద్దీ తరగతులు మారుతూ, కొత్త మిత్రులు వచ్చి చేరతారు. పాత మిత్రుల స్నేహం కొనసాగుతూనే ఉంటుంది. స్నేహితులు పెరిగిన కొద్దీ బయటి ప్రపంచం కొత్తగా కనిపిస్తుంది. అందరి సంస్కృతీ వారసత్వాలు అర్థం అవుతాయి. మన జీవితానికి లక్ష్యాలను కూడా మిత్రులు నిర్ణయించుకునే స్థాయి కూడా వస్తుంది.

జాతీయ స్నేహ దినం వేదికగా పాత మిత్రులను కలవడం, కొత్త మిత్రులతో సరదాగా గడపడం, ఆపాత మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకోవడం, పాత స్నేహితుల సమావేశం పెట్టుకోవడం, ఫ్రెండ్‌షిప్ బ్యాండ్స్ పంచుకోవడం, తమ తమ అనుభవాలను పంచుకోవడం, స్నేహితుల కష్టాలను తెలుసుకొని సహాయం చేయడం, సామాజిక మాధ్యమాల్లో స్నేహ బంధాల విలువను వివరించడం, పాత స్నేహితులతో ఉన్న ఫోటోలను పంచుకోవడం, హాపీ ఫ్రెండ్‌షిప్ డే శుభాకాంక్షలు చెప్పుకోవడం లాంటి కార్యక్రమాలను నిర్వహించుకోవచ్చు.



-మధుపాళీ
9949700037

# క్షేత్రస్థాయి ఆవిష్కర్తలతో భారత రాష్ట్రపతి భేటీ



న్యూ ఢిల్లీ, ఆగష్టు 1:అటల్ ఇన్నోవేషన్స్ మిషన్ పరిధిలోని క్షేత్రస్థాయి ఆవిష్కర్తల బృందం నేడు (జూలై 31, 2026న) రాష్ట్రపతి సాంస్కృతిక కేంద్రంలో భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్మును కలిసింది. ఆవిష్కర్తలు ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనను సందర్శించి, వారి ఆవిష్కరణలను రాష్ట్రపతి పరిశీలించారు. అనంతరం వారితో మాట్లాడారు.

ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ.. భారీ విస్తృతి, ఆవిష్కరణల స్ఫూర్తి ఆధారంగా క్షేత్రస్థాయి ఆవిష్కరణల్లో ప్రపంచానికి ప్రధాన కేంద్రంగా మారే సామర్థ్యం భారత్‌కు ఉందన్నారు. స్థానిక అనుభవం, శాస్త్రీయ ఆలోచన, వ్యక్తిగత సృజనాత్మకత, సామాజిక బాధ్యత కలగలసిన గ్రామీణ ఆవిష్కరణలు సమాజ అవసరాలకు ఎంతో ఉపయోగపడతాయని ఆమె పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ఆవిష్కర్తలు స్థానిక సమస్యలకు కనుగొంటున్న పరిష్కారాలు జాతీయ స్థాయిలో ప్రాముఖ్యత సంతరించుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వ్యర్థాలను సంపదగా మార్చడం, ఇంధన పొదుపు, మహిళలు, దివ్యాంగుల సౌకర్యాల పెంపు, పర్యావరణ పరిరక్షణ, వ్యవసాయం, కళల సంరక్షణ వంటి రంగాల్లో క్షేత్రస్థాయి ఆవిష్కర్తలు విశేష కృషి చేస్తున్నారని ఈ ప్రదర్శన నిరూపిస్తోందని తెలిపారు.

కేవలం ఆలోచనల ద్వారానే సమాజంలో మార్పులు రావని రాష్ట్రపతి తెలిపారు. ఈ ఆలోచనలను ముందుకు తీసుకెళ్లడానికి ప్రతిభకు సరైన మార్గదర్శకత్వం, తగిన వేదికలు, వనరులు కల్పించే వాతావరణం అవసరమని పేర్కొన్నారు. క్షేత్రస్థాయి ఆవిష్కర్తలకు సాంకేతిక మద్దతు, మార్గదర్శకత్వం అందిస్తుండటంతోపాటు వినూత్న ఆలోచనలను స్థిరమైన వ్యాపారాలుగా మార్చేందుకు అటల్ కమ్యూనిటీ ఇన్నోవేషన్ కేంద్రాలు చక్కని అవకాశాలను కల్పిస్తున్నాయని ఆమె కొనియాడారు.

సమస్యలకు పరిష్కారాలు కనుగొనేందుకు ప్రతి పౌరుడు ఆవిష్కరణల దృక్పథంతో పని చేసినప్పుడే వికసిత్ భారత్ దార్శనికత సాకారమవుతుందని రాష్ట్రపతి అన్నారు. వివిధ సంస్థలు, పౌరులు ఉమ్మడి లక్ష్యంతో కలిసికట్టుగా పనిచేస్తుండడం, ఆవిష్కరణల సంస్కృతి మరింత బలోపేతం కావడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఇటువంటి ప్రయత్నాల ఫలితాలు సమాజంలోని విస్తృత వర్గాలకు అందుతాయనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

పరిమిత వనరులు, అనిశ్చితులు, ఎదురయ్యే సవాళ్లను తట్టుకుంటూ చాలామంది ఆవిష్కర్తలు తమ ప్రయత్నాలను కొనసాగించారని రాష్ట్రపతి గుర్తుచేశారు. వ్యక్తులు, కుటుంబాలు సమాజాల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావాలనే ఆవిష్కరణల పట్ల వారికున్న దృఢ సంకల్పాన్ని ఆమె అభినందించారు. తమ ఆవిష్కరణలను నిరంతరం మెరుగువరచుకోవాలని, పరిశోధనా సంస్థలు, పరిశ్రమలు, ఇతర ఆవిష్కర్తలతో భాగస్వామ్యాలను పెంచుకోవాలని సూచించారు. ఆవిష్కరణలను మరింత విస్తృత స్థాయికి తీసుకెళ్లేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# 'ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజనకు కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, ఆగష్టు 1:'ప్రధాన మంత్రి సూర్య సరోవర్ యోజన (పీఎం-ఎస్ఎస్‌వై) పథకానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇంధన నిల్వ వ్యవస్థల (ఈఎస్ఎస్) సదుపాయంతో కూడిన తేలియాడే సౌర విద్యుత్ ప్రాజెక్టుల (ఎఫ్ఎస్‌పీవీ) అభివృద్ధికి ఉద్దేశించిన పథకమిది. మొత్తం రూ. 5,070 కోట్లను ఇందుకోసం కేటాయించనున్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈ రోజు సమావేశమైన కేంద్ర కేబినెట్ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.

5,000 మెగావాట్ల తేలియాడే సౌర విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని ఈ పథకం లక్ష్యంగా పెట్టుకుంది. కనీసం రెండు గంటల నిల్వ సామర్థ్యం (అంటే 10,000 మెగావాట్స్ అవర్) కలిగిన ఇంధన నిల్వ వ్యవస్థలనూ వీటితోపాటే ఏర్పాటు చేస్తారు. ఈ ప్రాజెక్టులకు 2026-27 నుంచి 2030-31 మధ్య ఆమోదం లభిస్తుంది. 2032-33 వరకు నిధుల పంపిణీ కొనసాగుతుంది.

జాతీయ సౌర శక్తి సంస్థ ఇటీవలి అంచనాల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. దేశంలోని జలాశయాలు, ఇతర అనువైన నీటి వనరుల ద్వారా.. తేలియాడే సౌర విద్యుత్ ప్రాజెక్టుల నుంచి దాదాపు 102.18 జీడబ్ల్యూపీ మేర సౌర విద్యుత్తును ఉత్పత్తి చేసే అవకాశం ఉందని ఈ సంస్థ అంచనా వేసింది.

అర్హత కలిగిన ప్రతీ తేలియాడే సౌర విద్యుత్ ప్రాజెక్టు విజయవంతంగా ప్రారంభమైన అనంతరం.. మెగావాట్‌కు రూ. కోటి చొప్పున కేంద్ర ఆర్థిక సాయాన్ని ఈ పథకం కింద అందిస్తారు. దీనితోపాటు సాధ్యా సాధ్యాల అధ్యయనం కోసం ప్రతి ప్రాజెక్టుకు రూ. 50 లక్షల వరకు సాయం లభిస్తుంది. ఇందులో భాగంగా నీటి లోతు (బాతిమెట్రీ), జలచిత్రణ (హైడ్రోగ్రఫీ) పరీక్షలు, పర్యావరణ అధ్యయనాలు, ప్రాజెక్టు అభివృద్ధిలో ఆటంకాలను తగ్గించడానికి అవసరమైన ఇతర సన్నాహక కార్యకలాపాలను చేపడతారు.

అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఈ పథకం ద్వారా ప్రయోజనం చేకూరుతుంది. ప్రస్తుతం దేశంలో తేలియాడే సౌర విద్యుత్ సామర్థ్యం 700 మెగావాట్లు మాత్రమే ఉండగా.. ఈ పథకం ద్వారా అది 5,000 మెగావాట్లకు పెంచుతుంది. ప్రస్తుతమున్న జలాశయాలు, పారిశ్రామిక నీటి నిల్వలను సమర్థంగా వినియోగించుకోవడానికి ఈ ప్రాజెక్టులు దోహదపడతాయి. అలాగే కొరతగా ఉన్న భూ వనరుల విషయంలో పోటీనీ తగ్గిస్తాయి. ఇంధన నిల్వ వ్యవస్థను అనుసంధానించడం గ్రిడ్ విశ్వసనీయతను, స్థిరత్వాన్ని పెంచడంలో దోహదపడుతుంది. ఏటా దాదాపు 10 మిలియన్ టన్నుల కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాలను తగ్గించడంలో ఈ పథకం సహాయపడుతుంది.

ప్రాజెక్టుకు సంబంధించి అన్ని దశల్లోనూ కలిపి దాదాపు 16,000 నుంచి 17,000 మందికి పూర్తిస్థాయి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. నీటిపై తేలియాడే వ్యవస్థల తోపాటు.. సౌర విద్యుత్ ఫలకాలు, మాడ్యూళ్లు, విద్యుత్ నిల్వ వ్యవస్థల వంటి ప్రాజెక్టుకు సంబంధించి ప్రతి దశలోనూ దేశీయ తయారీని కూడా ఈ పథకం ప్రోత్సహిస్తుంది. తద్వారా ఆత్మనిర్భర భారత్ సంకల్పానికి ఊతమిస్తుంది.

ఈ పథకం పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి దోహదపడడమే కాకుండా దేశ విద్యుత్, పర్యావరణ లక్ష్యాలను చేరుకోవడంలోనూ సాయపడుతుంది.




# అమరవీరుడు ఉధమ్ సింగ్‌నకు నివాళులు అర్పిస్తూ ఓ సంస్కృత సుభాషితాన్ని ప్రజలతో పంచుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఆగష్టు 1:విప్లవకారుడు ఉధమ్ సింగ్ బలిదాన దినం సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ హృదయపూర్వక నివాళి అర్పించారు. ఉధమ్ సింగ్ జీవితంలో నిండి ఉన్న సాహస, పరాక్రమాలు మాతృభూమి గౌరవాన్నీ, ఆత్మవిశ్వాసాన్నీ పరిరక్షించడానికి దేశంలో ప్రతి తరానికీ స్ఫూర్తిని అందిస్తుంటాయని ప్రధానమంత్రి అన్నారు.

"న జాతు శౌర్యం పురుషస్య భానురస్తం గతో భవతి కదాపి శశ్వత్, యథా పునస్తపతి దివాకరోయం తథా పునర్విక్రమతే స వీరః" అన్న ఓ సంస్కృత సుభాసితాన్ని ప్రజలతో ప్రధానమంత్రి పంచుకున్నారు.

పరాక్రమమనే సూర్యుడు ఎప్పటికీ అస్తమించడు. సూర్యుడు మరుసటి రోజు మళ్లీ ఉదయించి పూర్తి తేజస్సుతో ప్రకాశిస్తున్నట్లుగానే, వీరులు తమ పరాక్రమంతో ప్రతికూలతపై విజయాన్ని సాధిస్తుంటారని ఈ సుభాషితం మనకు చెబుతోంది.

సామాజిక మాధ్యమం 'ఎక్స్' లో ఒక సందేశాన్ని ప్రధానమంత్రి పొందుపరుస్తూ:

''మహా క్రాంతికారుడు షహీద్ ఉధమ్ సింగ్‌నకు ఆయన ప్రాణత్యాగ దినోత్సవం సందర్భంగా సాదర ప్రణామాలు. ధైర్య, పరాక్రమాలతో కూడిన ఆయన జీవిత కథ మాతృభూమి ఆత్మగౌరవాన్ని పరిరక్షించడానికి దేశంలో ప్రతి తరానికీ స్ఫూర్తిని అందిస్తుంది.

"న జాతు శౌర్యం పురుషస్య భానురస్తం గతో భవతి కదాపి శశ్వత్, యథా పునస్తపతి దివాకరోయం తథా పునర్విక్రమతే స వీరః" అని పేర్కొన్నారు.

# ఓదెల మల్లన్నను దర్శించుకున్న జాయింట్ సెక్రెటరీ

కరీంనగర్, ఆగష్టు 1: సుప్రసిద్ధ ఓదెల మల్లికార్జున స్వామిని కేంద్ర గ్రామీణ అభివృద్ధి భూ వనరుల శాఖ జాయింట్ సెక్రెటరీ పరికిపండ్ల నరహరి దర్శించుకున్నారు. శనివారం పెద్దపల్లి జిల్లా ఓదెల మల్లికార్జున స్వామి ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు.

మల్లికార్జున స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అధికారులు సీనియర్ ఐఏఎస్ అధికారి నరహరి కి స్వామి వారి ప్రసాదాలు అందించి సత్కరించారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలియజేశారు.

# 'సముద్ర మంథన్' పథకానికి రూ. 84,084 కోట్ల బడ్జెట్‌తో మంత్రిమండలి ఆమోదం

న్యూఢిల్లీ, ఆగష్టు 1:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన న్యూఢిల్లీలో సమావేశమైన కేంద్ర మంత్రిమండలి ఇవాళ 'సముద్ర మంథన్-జాతీయ సముద్రాంతర అన్వేషణ' పథకానికి ఆమోదముద్ర వేసింది. పెట్రోలియం-సహజ వాయువుల మంత్రిత్వశాఖ పరిధిలో మొత్తం రూ. 84,084 కోట్లతో 2030-31 వరకు ఈ కేంద్ర రంగ పథకం అమలవుతుంది.

భారత అపార సముద్ర గర్భ ఇంధన సామర్థ్య సద్వినియోగం కోసం 2025లో స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఎర్రకోట పైనుంచి ప్రధానమంత్రి ప్రకటించిన ఆధునిక సముద్రాన్వేషణ దృక్కోణానికి ఈ పథకం ఒక ప్రతీక. దేశ ఇంధన భద్రత బలోపేతం, దేశీయ అన్వేషణ-ఉత్పత్తి పెంపు, సాంకేతిక ముందంజకు ప్రోత్సాహం, వికసిత భారత్ సంకల్పం దిశగా ప్రస్థానంలో ఇదొక కీలక మలుపు.

సముద్రాంతర్భాగంలో అన్వేషణ విలువ వ్యవస్థ మొత్తం ఈ పథకం పరిధిలో సమగ్ర కార్యకలాపాలు చేపడతారు. ఇందులో భాగంగా అధిక-నాణ్యత గల భూకంప సమాచార విస్తృత సేకరణ-పరిశీలన-విశ్లేషణ చేస్తారు. అలాగే, లోతైన-అత్యంత లోతైన జలాల్లో అన్వేషణాత్మక తవ్వకాన్ని ముమ్మరం చేయడం సహా కొత్త బేసిన్లలో శాస్త్రీయ డ్రిల్లింగ్, ఉమ్మడి సముద్రాంతర ఉత్పాదన-తరలింపు మౌలిక సదుపాయాల కల్పన, సమీకృత చమురు-గ్యాస్ తయారీ, సేవల మండలి ఏర్పాటు వంటి వాటికీ ఈ పథకం వీలు కల్పిస్తుంది. దేశంలో సముద్రాంతర అన్వేషణ-ఉత్పత్తిని ముమ్మరం చేయగల సమీకృత వ్యవస్థ సృష్టి, డిజిటల్ ప్రోగ్రామ్ నిర్వహణ, సామర్థ్య వికాసం, సాంకేతిక పరిజ్ఞాన స్వీకరణ, వాటాదారుల భాగస్వామ్యం సహా అంతర్జాతీయంగా విస్తరణ దిశగానూ ఇందులో ప్రత్యేక వెసులుబాట్లు ఉన్నాయి.

ఈ పథకం 600 మిలియన్ మెట్రిక్ టన్నుల చమురుకు సమానమైన నిల్వల పెరుగుదలకు దోహదం చేస్తుందని, సముద్రాంతర్భాగంలో అన్వేషణ కార్యకలాపాలను గణనీయంగా పెంచుతుందని, దేశీయ చమురు-గ్యాస్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తుందని, పెద్ద ఎత్తున ఉపాధిని కల్పిస్తుందని అంచనా. అంతేకాకుండా మేక్ ఇన్ ఇండియా, స్వయంసమృద్ధ భారత్ కింద దేశీయ తయారీ రంగాన్ని బలోపేతం చేయడంతోపాటు సముద్రాంతర సాంకేతికతలు-సేవల రంగంలో ప్రపంచవ్యాప్తంగా పోటీపడగల వ్యవస్థ రూపకల్పనకు తోడ్పడుతుందని భావిస్తున్నారు. అన్వేషణ-ఉత్పత్తి విలువ శ్రేణి అంతటా గణనీయ పెట్టుబడులను ప్రోత్సహిస్తూ పారిశ్రామిక, ఆవిష్కరణ, ఆర్థిక వృద్ధికి దీర్ఘకాలిక అవకాశాలను సృష్టించగలదని ఆశిస్తున్నారు.

అభివృద్ధి చెందిన దేశంగా రూపాంతరీకరణ వైపు భారత్ వేగంగా పురోగమిస్తున్న నేపథ్యంలో సముద్ర మంథన్ ఒక పరిణామాత్మక జాతీయ కార్యక్రమంగా నిలుస్తుంది. దేశంలోని సముద్రతీర ఇంధన వనరుల వెలికితీత, దీర్ఘకాలిక ఇంధన భద్రత బలోపేతం, సాంకేతిక సామర్థ్యాల పెంపు, ఆర్థిక వ్యవస్థతోపాటు భావితరాలకు శాశ్వత విలువ సృష్టి తదితరాలకు దోహదం చేయగలదు.

మొత్తం మీద గడచిన దశాబ్దంలో ప్రభుత్వం అప్‌స్ట్రీమ్ రంగంలో విప్లవాత్మక సంస్కరణలు తెచ్చింది. ఇందులో భాగంగా దాదాపు మొత్తం ఆఫ్‌షోర్ ప్రాంత అన్వేషణకు అనుమతించింది. శాసన-ఒప్పంద చట్రం ఆధునికీకరణ, జాతీయ డేటా భాండాగార బలోపేతం వంటివి అమలు చేసింది. ఈ సంస్కరణలు ప్రాతిపదికగా వ్యూహాత్మక ప్రభుత్వ పెట్టుబడి, అత్యాధునిక సాంకేతికతలు, అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాల ద్వారా ఆఫ్‌షోర్ అన్వేషణను ముమ్మరం చేయడంలో సముద్ర మంథన్ పథకం నవ శకానికి నాంది పలకనుంది.

# గంజాయితో దొరికిన ఈగిల్ టీం కానిస్టేబుల్

## -వివరాలు వెల్లడించిన ఏసిపి విజయ్ కుమార్



కరీంనగర్, ఆగష్టు 1:మాదకద్రవ్యాల నియంత్రణ విభాగంలో పనిచేస్తూ స్నేహితుని కోసం అతని ప్రత్యర్థి పై అక్రమ కేసు పెట్టేందుకు గంజాయి నిల్వచేసిన ఈగల్ టీం కానిస్టేబుల్ ను పోలీసులు అరెస్టు చేశారు. పట్టుబడిన నిందితుని వివరాలను కొత్తపెల్లి పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రూరల్ ఏసిపి విజయ్ కుమార్ వెల్లడించారు.

కరీంనగర్ మండలం సీతారాంపూర్ లో నివాసముంటున్న ఈగల్ టీం కానిస్టేబుల్ మెడబోయిన నాగరాజు వద్ద గంజాయి నిల్వ ఉందన్న సమాచారంతో అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి 370 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నాగరాజును విచారించగా చిగురుమామిడి మండలం కొండాపూర్ కు చెందిన శ్రీనివాస్ కు నాగరాజుకు పరిచయం ఉంది.

అదే గ్రామంలో శ్రీనివాస్ కు శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తులకు మధ్య భూతగాదాలు ఉండడంతో అవి ఎన్నిసార్లు పంచాయతీ నిర్వహించిన కొలిక్కి రాకపోవడంతో అతన్ని కేసులో ఇరికించాలనే ఉద్దేశంతో నాగరాజు శ్రీనివాసులు కలిసి పథకం పన్నారు. స్నేహితుని కోసం కానిస్టేబుల్ నాగరాజు వరంగల్ నుంచి గంజాయి తెప్పించి శ్రీనివాస్ రెడ్డికి చెందిన ఎరువుల దుకాణంలో పెట్టాడు.

తిరిగి పోలీసులకు సమాచారం అందించి చిరుమామిడి పోలీస్టేషన్లో కేసు నమోదయ్యేలా చేసి కటకటాల పాలు చేశారు. వరంగల్ నుంచి తెప్పించిన గంజాయిలో కిలో గంజాయి శ్రీనివాస్ రెడ్డి దగ్గర దొరికినట్లు చూపించగా మిగిలిన 3 70 గ్రాముల గంజాయిని తన ఇంట్లో నిల్వ ఉంచుకున్నాడు.

పక్కా సమాచారం అందుకున్న పోలీసులు నాగరాజు ఇంట్లో దాడులు నిర్వహించి గంజాయి తోపాటు నాలుగు సెల్ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన కానిస్టేబుల్ పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్ కు తరలిస్తామని ఏసిపి విజయ్ కుమార్ తెలిపారు.

# సవరించిన ఖేలో ఇండియా పథకానికీ, జాతీయ క్రీడా సమాఖ్యలకు ఆర్థిక సాయాన్ని పెంచేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, ఆగష్టు 1:యువత అభివృద్ధి, దేశ నిర్మాణానికి క్రీడాశక్తిని ఉపయోగించుకోవాలన్న నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ ఈ రోజు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ మరో ముఖ్యమైన నిర్ణయాన్ని తీసుకుంది. 2026?27 నుంచి 2030?31 వరకు గల అయిదేళ్ల కాలానికి గాను రూ. 36,441 కోట్ల సంయుక్త కేటాయింపుతో మార్పులు చేసిన ఖేలో ఇండియా పథకానికి, బలోపేతం చేసిన 'జాతీయ క్రీడా సమాఖ్యలకు ఆర్థిక సహాయం (ఏఎన్ఎస్ఎఫ్)' కార్యక్రమానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో ఖేలో ఇండియానే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన క్రీడా అభివృద్ధి కార్యక్రమం. ఇది క్రీడల పట్ల దేశ యువత ఆశయాలకు ఒక పెద్ద ఊతమివ్వటంతో పాటు రాబోయే దశాబ్దంలో పరివర్తనాత్మక ప్రభావాన్ని చూపుతుంది.

గత ఖేలో ఇండియా పథకంతో పోలిస్తే ఈ సరికొత్త పథకానికి దాదాపు ఎనిమిది రెట్లు ఎక్కువ బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయి. యువత అభివృద్ధికి, దేశ నిర్మాణానికి, ప్రపంచ క్రీడాశక్తిగా భారత్ అవతరించడానికి మూలస్తంభంగా- క్రీడల్ని మార్చాలన్న ప్రభుత్వ నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుంది.

పాఠశాల మైదానాలు, గ్రామీణ క్రీడా ప్రాంగణాల నుంచి ఒలింపిక్ వేదిక వరకు ప్రతి ప్రతిభావంతమైన యువ భారతీయుడికి అన్ని వేళలా ఒక మార్గాన్ని సృష్టించేలా ఈ నూతన పథకం రూపుదిద్దుకుంది. భౌగోళిక పరిస్థితులు, ఆర్థిక నేపథ్యం లేదా అవకాశాలు లేకపోవడం వల్ల ఏ ఒక్క క్రీడాకారుడు గుర్తింపు లేకుండా మిగిలిపోకుండా ఉండటానికి ఇది భరోసానిస్తుంది.

ఖేలో భారత్ నీతి- 2025, జాతీయ విద్యా విధానం-2020ల దృక్పథానికి అనుగుణంగా 2030 కామన్వెల్త్ క్రీడలు, ఒలింపిక్- పారాలింపిక్ క్రీడలను నిర్వహించేందుకు భారత్ చేస్తున్న ప్రయత్నాలతో సహా దేశానికి ఉన్న దీర్ఘకాలిక క్రీడా ఆశయాలకు బలమైన ఆధారాన్ని ఏర్పాటు చేస్తూ ఈ పథకం క్రీడలను విద్య, ఫిట్‌నెస్, సాంకేతికత, అత్యున్నత స్థాయి శిక్షణతో అనుసంధానిస్తుంది.

ప్రతిభావంతుడైన ప్రతి యువకుడూ రాణించడానికి ఒక మార్గం:

మొట్టమొదటిసారిగా.. ప్రతిభావంతులను గుర్తించటం, శాస్త్రీయ శిక్షణ నుంచి అంతర్జాతీయ పోటీ- ఒలింపిక్ సన్నాహాల వరకు ప్రతి దశలో యువ అథ్లెట్లకు మద్దతుగా సమగ్ర అథ్లెట్ అభివృద్ధి మార్గాన్ని సృష్టించారు.

ఈ పథకం జాతీయ ఎక్సలెన్స్ కేంద్రాలు (ఎన్‌సీఓఈ- నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు), ఖేలో ఇండియా ఎక్సలెన్స్ కేంద్రాలు (ఖేఐసీఓఈ- ఖేలో ఇండియా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు), సాయ్ శిక్షణ కేంద్రాలు (ఎస్‌టీసీఎస్), ఖేలో ఇండియా గుర్తింపు పొందిన అకాడమీలు (కేఐఏఏలు), ఖేలో ఇండియా కేంద్రాలు (కేఐసీలు), సాయుధ దళాల యూత్ స్పోర్ట్స్ యూనిట్లతో (వైఎస్‌సీఎస్) కూడిన ఒక సమగ్ర దేశవ్యాప్త క్రీడా వ్యవస్థను ఏర్పాటు చేస్తుంది. ఈ సంస్థలన్నీ కలిసి దేశవ్యాప్తంగా ప్రపంచ స్థాయి కోచింగ్, క్రీడా విజ్ఞాన మద్దతు, ఆధునిక మౌలిక సదుపాయాలను అందిస్తాయి.

పాఠశాల క్రీడా వ్యవస్థను బలోపేతం చేయడానికి 'ఖేలో ఇండియా ఫీడర్ స్కూల్స్ (కేఐఎఫ్ఎఎస్), ఖేలో ఇండియా ఉత్కృష్ట విద్యాలయాలు (కేఐయూవీ)' అనే రెండు కొత్త కార్యక్రమాలను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇవి క్రీడలను ప్రధాన స్రవంతి చదువులతో అనుసంధానిస్తాయి. ప్రతిభావంతులైన పిల్లలను ముందుగానే గుర్తించి క్రమపద్ధతిలో వారి పురోగతికి వీలు కల్పిస్తాయి.

ఈ మెరుగుపరిచిన పథకం కింద ప్రధానంగా.. ఇప్పటికే ఉన్న ఖేలో ఇండియా అథ్లెట్ల కార్యక్రమంతో పాటు 'ఎమర్జింగ్ ఖేలో ఇండియా అథ్లెట్స్ (ఈ-కేఐఏ)' విభాగాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇది సంస్థాగత అథ్లెట్ అభివృద్ధి వ్యవస్థను దాదాపు పది రెట్లు విస్తరింపజేస్తుంది. వేలాది మంది అదనపు యువ అథ్లెట్లను వృత్తిపరమైన కోచింగ్, శాస్త్రీయ మద్దతు, దీర్ఘకాలిక మార్గదర్శకత్వంలోకి తీసుకువస్తుంది.

నైపుణ్య గుర్తింపు అభివృద్ధి కమిటీలు, జోనల్ కమిటీలు, టాలెంట్ స్కౌట్స్, హై-పెర్ఫార్మెన్స్ డైరెక్టర్లు, హై-పెర్ఫార్మెన్స్ మేనేజర్లతో కూడిన బలమైన దేశవ్యాప్త నైపుణ్య గుర్తింపు వ్యవస్థ.. దేశవ్యాప్తంగా ప్రతిభావంతులైన అథ్లెట్లను నిరంతరం గుర్తించడం, అభివృద్ధి చేయటాన్ని నిర్ధారిస్తుంది. ఈ పథకం- కింది స్థాయి పోటీల నుంచి ఖేలో ఇండియా ద్వారా, ఆ తర్వాత టార్గెట్ ఒలింపిక్ పోడియం పథకం (టాప్స్) వరకు క్రీడాకారులు ఉన్నత స్థాయికి ఎదిగేలా స్పష్టమైన పురోగతి మార్గాన్ని ఏర్పాటు చేస్తుంది. దీని ద్వారా అర్హులైన అథ్లెట్లు ప్రపంచ స్థాయి శిక్షణ, అంతర్జాతీయ అనుభవం, అత్యున్నత స్థాయిలో పతకాల కోసం పోటీ పడేందుకు సమగ్ర మద్దతును పొందుతారు.

క్రమం తప్పకుండా జరిగే పోటీలపై క్రీడా రంగంలో రాణించడం ఆధారపడి ఉంటుందన్న ఉద్దేశంతో ఈ పథకం.. భారత దేశీయ క్రీడా పోటీల వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుంది. యువ క్రీడాకారులకు నిరంతరం పోటీ అనుభవాన్ని అందించడానికి.. జాతీయ ఛాంపియన్‌షిప్‌లతో పాటు పాఠశాల, విశ్వవిద్యాలయ, ప్రాంతీయ, క్రీడా-నిర్దిష్ట లీగ్‌లకు ఇది మద్దతు ఇస్తుంది.

మహిళా అథ్లెట్లు, పారా-అథ్లెట్లు, స్వదేశీ క్రీడలు.. శాంతికీ, సమాజ అభివృద్ధికీ ఒక సాధనంగా క్రీడా అవకాశాలను విస్తరించడంపై ఈ పథకం ప్రత్యేక దృష్టి సారించింది. జాతీయ క్రీడల నిర్వహణకు, భారత్‌లో ప్రధాన అంతర్జాతీయ క్రీడా కార్యక్రమాలను నిర్వహించడానికి కూడా ఈ పథకం మద్దతు అందిస్తుంది.

ముఖ్యంగా యువతలో శారీరక దృఢత్వాన్ని దేశవ్యాప్తంగా ఒక ఉద్యమంగా ప్రోత్సహించడానికి 'ఫిట్ ఇండియా కార్యక్రమం' గణనీయంగా విస్తరించనుంది. చురుకైన జీవనశైలి, క్రీడలలో మహిళల భాగస్వామ్యం, సరిహద్దు- మారుమూల ప్రాంతాల్లో అవగాహన కల్పించటం, మాదకద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా క్రీడా ఆధారిత కార్యక్రమాలను ఇది ప్రోత్సహిస్తుంది. దీని ద్వారా సామాజిక పరివర్తనకు క్రీడలు ఒక సాధనంగా ఉపయోగపడతాయన్న విషయం మరోసారి స్పష్టమౌతుంది.

ప్రపంచ స్థాయి మద్దతు వ్యవస్థలతోనే అథ్లెట్లు రాణించగలరన్న నమ్మకంతో దేశవ్యాప్తంగా కోచింగ్ అర్హతలను ప్రామాణీకరించడానికి, వృత్తిపరమైన ప్రమాణాలను మెరుగుపరిచేందుకూ, కోచ్‌లు- సహాయక సిబ్బంది సామర్థ్యాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం 'నేషనల్ కోచ్ అక్రిడిటేషన్ బోర్డ్ (ఎన్‌ఏసీబీ)'ను ఏర్పాటు చేస్తుంది.

ఈ పథకం అథ్లెట్ డేటాబేస్‌లు, మౌలిక సదుపాయాలు, పోటీలు, కోచింగ్ వనరులు, నైపుణ్యాల అంచనాలు, నిధులు, ఫిట్ ఇండియా భాగస్వామ్యాన్ని అనుసంధానించే ఏకీకృత డిజిటల్ క్రీడా వేదికను కూడా ఏర్పాటు చేయాలన్న ఆలోచనతో ఉంది. ఈ వేదిక డేటా-ఆధారిత ప్రణాళిక, పారదర్శక పరిపాలన, వ్యక్తిగతీకరించిన అథ్లెట్ అభివృద్ధికి వీలు కల్పిస్తుంది.

క్రీడా మౌలిక సదుపాయాలు, నైపుణ్యమైన క్రీడాకారుల అభివృద్ధి, అథ్లెట్‌కు సహాయం చేయటం, ఆవిష్కరణలు- నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి ప్రభుత్వం ప్రైవేట్ అకాడమీలు, కార్పొరేట్ భాగస్వాములు, ఇతర సంస్థలతో సహకారాన్ని మరింతగా పెంచుతుంది. దీని ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో నడిచే నిజమైన జాతీయ క్రీడా వ్యవస్థ తయారవుతుంది.

ఈ పునరుద్ధరించిన ఖేలో ఇండియా పథకానికి తోడుగా 2026-31 కాలానికి గానుమెరుగుపరిచిన 'జాతీయ క్రీడా సమాఖ్యలకు సహాయం (ఏఎన్ఎస్ఎఫ్)' పథకానికి కూడా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద కోచింగ్, క్రీడా విజ్ఞానం, ఆధునిక పరికరాలు, అంతర్జాతీయ అనుభవం, కోచింగ్ క్యాంపులు, విదేశీ నిపుణుల భాగస్వామ్యం, ప్రధాన అంతర్జాతీయ పోటీలలో పాల్గొనడం కోసం నిధులను అందించటం ద్వారా భారతీయ క్రీడాకారులు, జట్లకు మద్దతు ఇస్తుంది. ఇది గ్లోబల్ సౌత్ దేశాలతో క్రీడా సహకారానికి మద్దతు ఇస్తుంది.. అంతర్జాతీయంగా భారతదేశ స్వదేశీ క్రీడలను ప్రోత్సహిస్తుంది.

పునరుద్ధరించిన ఖేలో ఇండియా పథకం భారతదేశ క్రీడా భవిష్యత్తు కోసం ఇప్పటి వరకు చేసిన అతిపెద్ద పెట్టుబడుల్లో ఒకటిగా నిలుస్తుంది. ఇది కేవలం ఒక క్రీడా కార్యక్రమం మాత్రమే కాదు.. యువ భారతీయులకు అవకాశం, ఆత్మవిశ్వాసం, శ్రేష్టతను అందించే ఒక జాతీయ మిషన్. అట్టడుగు స్థాయి ప్రతిభ నుంచి ప్రపంచ క్రీడా విజయం వరకు ఒక సజావైన మార్గాన్ని సృష్టించడం ద్వారా 'వికసిత్ భారత్- 2047' దృక్పథం వైపు పయనిస్తోన్న దేశంలో ఛాంపియన్లను పెంపొందించడం, ఫిట్‌నెస్ సంస్కృతిని ప్రేరేపించడం, భారతదేశ క్రీడా వ్యవస్థను బలోపేతం చేయడం, ప్రపంచంలోని ప్రముఖ క్రీడా దేశాలలో ఒకటిగా నిలబెట్టాలనే లక్ష్యంతో ఈ పథకం ఉంది.

# అంతర్గాం భూముల అన్యాక్రాంతం పై ఆరా

## -తాసిల్దార్ కార్యాలయంలో సమీక్ష

కరీంనగర్, ఆగష్టు 1: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి భాగస్వామ్యంతో నిర్మాణం చేసిన అంతర్గాం స్పిన్నింగ్, వీవింగ్ మిల్లు భూముల అన్యక్రాంతంపై జిల్లా ఉన్నతాధికార యంత్రాంగం సీరియస్ గా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. శుక్రవారం సాయంత్రం పెద్దపెల్లి జిల్లా అదనపు కలెక్టర్ ,స్పిన్నింగ్, వీవింగ్ మిల్లుల లిక్విడేటర్ శ్రీరాములు అంతర్గంలో పర్యటించారు.

స్పిన్నింగ్ వీవింగ్ మిల్ ఆధీనంలో ఉన్న భూములను అంతర్గాం తాసిల్దార్ ప్రసాద్ తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం ప్రభుత్వం ఆధీనం లో ఉన్న భూమి ఎంత.. మిల్లు కార్మికుల ఇండ్ల కోసం కేటాయించబడ్డ భూమి ఎంత..! అసలు అన్యాక్రాంతం అయినా భూమి ఎంత అన్న వివరాలను అదనపు కలెక్టర్ శ్రీరాములు ఆరా తీశారు.

మిల్లు భూములకు సంబంధించి రికార్డులను స్వయంగా పరిశీలించారు. క్షేత్రస్థాయిలో మిల్లు భూములకు సంబంధించి హద్దుల వివరాలను తాసిల్దార్ నుండి సేకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీరాములు మాట్లాడుతూ భూభారతి పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి వెంటనే క్లియర్ చేయాలి అన్నారు.

అదేవిధంగా సర్ ప్రక్రియ కార్యక్రమం సాధ్యమైనంత తొందరలో వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం భారీ వర్షాలతో గంట గంటకు పెరుగుతున్న శ్రీపాద సాగర్ ఎల్లంపల్లి ప్రాజెక్టు వరద ఉధృతిని అదనపు కలెక్టర్ శ్రీరాములు పరిశీలించారు. ప్రాజెక్టుకు వచ్చే ఇన్ఫ్లో? దిగువకు విడుదల చేస్తున్న నీటి వివరాలను తెలుసుకున్నారు.



ఇదిలా ఉండగా మిల్లు భూములను అన్యకరాంతమైనట్లు గుర్తించిన రెవెన్యూ అధికారులు సదరు కబ్జాదారులకు ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు తాసిల్దార్ ప్రసాద్ తెలిపారు.

దశాబ్దాల క్రితం ఇక్కడ మిల్లులు ఏర్పాటు చేసినప్పుడు కేటాయించబడ్డ భూమి 553 ఎకరాలు కాగా ప్రస్తుతం 324 ఎకరాలు ప్రభుత్వ ఆధీనంలో ఉన్నట్లు తెలుస్తోంది. మిగతా భూమిలో వందలాదిమంది అప్పటి కార్మిక కుటుంబాల కోసం ఇండ్ల నిర్మాణాలు చేశారు.

అదికాక ఇదే మిల్లుకు సంబంధించి ఆధీనంలో ఉన్న భూమిలో కొంత భాగం అన్యక్రాంతమైనట్లు ఆరోపణలు వ్యక్తం కావడం? జిల్లా రెవెన్యూ యంత్రాంగం సైతం గుర్తించడం? విరసి స్వయంగా జిల్లా అదనపు కలెక్టర్ భూముల పరిశీలన చేయడం ఒక ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. అయితే కబ్జాదారులపై ఎలాంటి చర్యలు ఉంటాయన్న అంశాలపై ఇక్కడ ప్రధానంగా చర్చ జరుగుతోంది.

# భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక జారీ

ఖమ్మం, ఆగష్టు 1: ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు చేరడంతో భద్రాచలం వద్ద గోదావరి ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. శుక్రవారం అర్ధరాత్రి గోదావరి నీటిమట్టం 53 అడుగులకు చేరడంతో జిల్లా కలెక్టర్ అంకిత్ మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. శనివారం ఉదయం 11 గంటల నాటికి గోదావరి నీటిమట్టం 56.1 అడుగులకు చేరగా, దిగువకు 16 లక్షల క్యూసెక్కులకు పైగా వరద నీటిని విడుదల చేస్తున్నారు.

వరద ప్రభావంతో భద్రాచలం- చర్ల మార్గంతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లే పలు రహదారులు మూసివేయబడ్డాయి. భద్రాచలం-చర్ల రహదారిపై పలుచోట్ల వరద నీరు చేరడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గురువారం నుంచి శుక్రవారం రాత్రి వరకు గోదావరి నీటిమట్టం సుమారు 25 అడుగులు పెరగడం స్థానికుల్లో ఆందోళన కలిగిస్తోంది. పరిస్థితిని జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్ క్షేత్రస్థాయిలో పరిశీలించి కరకట్ట, శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ పరిసరాలను సందర్శించారు. అధికారులకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు.

శనివారం మధ్యాహ్నం తర్వాత వరద ఉధృతి కొంత తగ్గే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. అయితే వరద కారణంగా భద్రాచలం దాదాపు అన్ని వైపులా రాకపోకలు నిలిచిపోగా, సారపాకకు వెళ్లేందుకు పాత వంతెన మాత్రమే అందుబాటులో ఉండటం స్థానికుల్లో ఆందోళనకు కారణమైంది.

# తల్లిపాలతోనే శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం

## -ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ



మహబూబ్‌నగర్, ఆగష్టు 1:నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల పరిధిలోని చిన్నపోర్ల గ్రామంలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నపోర్ల గ్రామ సర్పంచ్ గాండ్ల నికిత ప్రశాంత్ మాట్లాడుతూ, తల్లిపాలు శిశువుకు ఉత్తమమైన ఆహారమని తెలిపారు. శిశువు జన్మించిన గంటలోపే తల్లిపాలు పట్టించడం వల్ల ఆరోగ్యంగా ఎదుగుతాడని పేర్కొన్నారు.

తొలి ఆరు నెలల పాటు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, అనంతరం పోషకాహారంతో పాటు తల్లిపాలను కొనసాగించాలని సూచించారు. తల్లిపాల ద్వారా శిశువుకు రోగనిరోధక శక్తి పెరిగి సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా ఎదుగుతాడని వివరించారు.

ఈ కార్యక్రమంలో ఆయుష్ ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ సుధారాణి, అంగన్వాడీ టీచర్లు సుజాత, అరుణ, విద్యావతి, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## -అవసరమైతే వెంటనే బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశం



ఖమ్మం, ఆగష్టు 1:గోదావరి నదికి వరద ఉద్ధృతి కొనసాగుతున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. శుక్రవారం సాయంత్రం మండల పరిధిలోని సారపాక, రెడ్డిపాలెం ప్రధాన రహదారులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గోదావరి నీటిమట్టం మరింత పెరిగితే సారపాక-రెడ్డిపాలెం ప్రధాన రహదారిపై వరద నీరు చేరి రాకపోకలకు అంతరాయం కలిగే అవకాశం ఉందని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అవసరమైతే వెంటనే బ్యారికేడ్లు ఏర్పాటు చేసి, వాహనాలు, ప్రజలు ఆ మార్గంలో ప్రయాణించకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు, రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ అంకిత్ సూచించారు.

# విజయవాడ అభివృద్ధే లక్ష్యం

## -8 ఆర్ఓబీలు, అమృత్ భారత్ అభివృద్ధి, కొత్త రైలు సేవలపై వినతి

అమరావతి, ఆగష్టు 1:విజయవాడ నగర రైల్వే సమస్యల పరిష్కారమే మా ప్రధాన లక్ష్యం అని,ట్రాఫిక్ కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపేలా ఎనిమిది రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణంతో పాటు విజయవాడ రైల్వే స్టేషన్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం అని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. కేంద్ర రైల్వే మంత్రిని కలిసి అన్ని ప్రతిపాదనలను ఆమోదింపజేసేందుకు కృషి చేస్తాం అని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. సౌత్ కోస్టల్ రైల్వే జనరల్ మేనేజర్ మాథుర్‌ను కలిసి విజయవాడ నగరం, పరిసర ప్రాంతాలకు సంబంధించిన పలు కీలక రైల్వే సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు ఎంపీ వివరించారు.

నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఎనిమిది రైల్వే ఓవర్ బ్రిడ్జిల (ఆర్ఓబీలు) నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కోరినట్లు చెప్పారు. పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల ప్రజలకు అత్యంత కీలకమైన ఎర్రకట్ట రైల్వే వంతెన పనులను ప్రాధాన్యంగా చేపట్టాలని, అలాగే గుణదల ఎల్‌సీ వద్ద ఆర్ఓబీ నిర్మాణాన్ని అత్యవసరంగా మంజూరు చేయాలని జీఎంకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు."విజయవాడ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచినా స్పందన లేక ఆలస్యం జరుగుతోంది. రాష్ట్ర ఎంపీలందరం కలిసి కేంద్ర రైల్వే మంత్రిని కలిసి విజయవాడ స్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద సమగ్రంగా అభివృద్ధి చేయాలని కోరుతాం" అని ఎంపీ కేశినేని శివనాథ్ వెల్లడించారు.

# 'అరైవ్ అలైవ్' స్పెషల్ డ్రైవ్‌తో ట్రాఫిక్ నిబంధనలపై కఠిన చర్యలు

## ప్రజల సహకారంతోనే ప్రమాదరహిత సమాజం : ఎస్పీ సంకీర్త్, ఆర్టీవో శ్రీనివాస్



ఖమ్మం, ఆగష్టు 1: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో అవగాహన పెంపు లక్ష్యంగా జిల్లా పోలీసు శాఖ, రవాణా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో 'అరైవ్ అలైవ్' స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.

జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, జిల్లా రవాణా శాఖ అధికారి బరగడి శ్రీనివాస్ స్వయంగా తనిఖీల్లో పాల్గొని ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై చర్యలు చేపట్టారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపిన వారికి జరిమానాలు విధించారు.

మైనర్లు వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించిన వారిని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించి, వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన వల్ల కలిగే ప్రమాదాలను వివరించి, భవిష్యత్తులో అలాంటి తప్పిదాలకు పాల్పడవద్దని హెచ్చరించారు.

ఈ ప్రత్యేక డ్రైవ్‌లో రాష్ట్రవ్యాప్తంగా అవగాహన పెంపొందించే లక్ష్యంతో వినూత్న విధానాన్ని అమలు చేశారు. తనిఖీల్లో పట్టుబడిన వాహనాలకు జరిమానాలు విధించినప్పటికీ, ఆయా వాహనాలు ఏ జిల్లాకు చెందినవో ఆ జిల్లా ఆర్టీవో కార్యాలయంలోనే జరిమానా చెల్లించేలా రసీదులు జారీ చేశారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 'అరైవ్ అలైవ్' కార్యక్రమంపై మరింత అవగాహన పెరుగుతుందని అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఆర్టీవో బరగడి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18 ఏళ్లలోపు మైనర్లు వాహనాలు నడపడం, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, ట్రిపుల్ రైడింగ్, అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, సీటుబెల్ట్ ధరించకపోవడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించడం, రాంగ్‌రూట్‌లో ప్రయాణించడం వంటి ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు.

ప్రతి వాహనదారుడు ఐఎస్ఐ ప్రమాణాల హెల్మెట్ ధరించడం, సీటుబెల్ట్ తప్పనిసరిగా వినియోగించడం, ట్రాఫిక్ సంకేతాలను పాటించడం, వేగ పరిమితులను అధిగమించకుండా ఉండడం, మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగాన్ని పూర్తిగా నివారించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని సూచించారు.

రోడ్డు భద్రత పోలీసు, రవాణా శాఖల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత కూడా అని పేర్కొన్నారు.

# పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తాం..

## -2027 జనవరిలో అక్కపల్లి లిఫ్ట్ ద్వారా నీటి ఎత్తిపోతలు ప్రారంభం

అమరావతి, ఆగష్టు 1:రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను దశలవారీగా పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం స్తంభంపల్లి చెరువును పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు.

ధర్మపురి నియోజకవర్గం గోదావరి ఒడ్డున ఉన్నప్పటికీ గత ప్రభుత్వ హయాంలో రైతులకు అవసరమైన సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని మంత్రి విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా రైతులకు ఉపయోగపడే ప్రాజెక్టులను పూర్తి చేయడంలో విఫలమయ్యారని అన్నారు. రోళ్ళవాగు ప్రాజెక్టు అంచనాలను పెంచి అసంపూర్తిగా వదిలేశారని, అక్కపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు కాగితాలకే పరిమితమయ్యాయని పేర్కొన్నారు.


# హనుమకొండ జిల్లాలో కలకలం..

## –కేజీబీవీ హాస్టల్ నుంచి ముగ్గురు విద్యార్థినులు అదృశ్యం

హన్మకొండ, ఆగష్టు 1:(నేటినిజం ప్రతినిధి) హనుమకొండ జిల్లా శాయంపేటలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) హాస్టల్‌లో ముగ్గురు విద్యార్థినులు అదృశ్యమైన ఘటన ఆందోళన కలిగిస్తోంది. 6, 7, 8వ తరగతులకు చెందిన విద్యార్థినులు అర్ధరాత్రి సమయంలో హాస్టల్ ప్రహరీ గోడ దాటి బయటకు వెళ్లినట్లు ప్రాథమిక సమాచారం ప్రచారమైంది. ఉదయం హాస్టల్ సిబ్బంది తనిఖీలు నిర్వహించే సమయంలో విద్యార్థినులు కనిపించకపోవడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వెంటనే పాఠశాల ప్రిన్సిపాల్ ఉదయం సుమారు 5 గంటల ప్రాంతంలో పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే పాఠశాలకు చేరుకుని ఘటనపై విచారణ ప్రారంభించారు. హాస్టల్‌లో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తూ, విద్యార్థినులు ఏ పరిస్థితుల్లో బయటకు వెళ్లారనే విషయాన్ని ఆరా తీశారు. వారి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలతో సమీప ప్రాంతాల్లో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

హాస్టల్‌లో భద్రతా ఏర్పాట్లు ఉన్నప్పటికీ విద్యార్థినులు ఎలా బయటకు వెళ్ళారనే అంశం చర్చనీయంశం అయ్యింది. భద్రతా వ్యవస్థలో ఏవైనా లోపాలు ఉన్నాయా? అనే కోణంలోనూ అధికారులు విచారణ చేపట్టారు. ముమ్మరంగా చేపట్టిన గాలింపు చర్యలు ఫలించాలని తెలుస్తోంది. పాఠశాల నుంచి కనిపించకుండా పోయిన విద్యార్థినీల ఆచూకీ ఛేదించి విద్యార్థులను విచారిస్తున్నట్లు తెలుస్తోంది. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# భద్రాచలం వద్ద గోదావరి ఉగ్రరూపం.. మూడో ప్రమాద హెచ్చరిక జారీ



ఖమ్మం, ఆగష్టు 1: భద్రాచలం వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. రెండు రోజుల వ్యవధిలోనే సుమారు 50 అడుగులు దాటి ఉధృతంగా ప్రవహిస్తోంది. శుక్రవారం అర్ధరాత్రి 53 అడుగులకు చేరిన గోదావరి నీటిమట్టం శనివారం ఉదయానికి 55.1 అడుగులకు పెరిగింది. దీంతో అధికారులు మూడో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న జిల్లా యంత్రాంగం అప్రమత్తమై సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించింది. జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్ వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి, లోతట్టు ప్రాంతాల ప్రజలను వెంటనే సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు.

భద్రాచలం – వెంకటాపురం మార్గంలో రహదారిపైకి వరద నీరు చేరింది. దీంతో భద్రాద్రి ఏజెన్సీలోని వివిధ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఇక, చర్ల మండలం వీరాపురం ఇసుక ర్యాంపును గోదావరి వరద చుట్టుముట్టింది. అక్కడి గోదావరి పాయలోని ఇసుక ర్యాంపులో లారీ డ్రైవర్లతోపాటు 46 మంది ర్యాంపు సిబ్బంది చుక్కుకు పోయారు. లారీలు కూడా అందులోనే ఉన్నాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు.. రెస్క్యూ బృందాలను రంగంలోకి దింపారు. ఆ బృంద సభ్యులు యంత్రాలు, తెప్పలపై వెళ్లి ర్యాంపు సిబ్బందిని, డ్రైవర్లను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. అయితే, ర్యాంపు సిబ్బందిని రక్షించేందుకు తెప్పపై వెళ్తున్న చర్ల సీఐ రాజువర్మకు తృటిలో ప్రమాదం తప్పింది.

వరదలో కొద్దిదూరం వెళ్లాక తెప్ప తిరబడింది. దీంతో సీఐ చాకచక్యంగా అదే తెప్పను పట్టుకొని సురక్షితంగా ఒడ్డుకు చేరారు. అయితే, గోదావరి వరదల నేపథ్యంలో ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బలగాలను ఉన్నతాధికారులు రంగంలోకి దింపారు. భద్రాద్రి కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్‌రాజు, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట సహా ఇతర ఉన్నతాధికారులందరూ భద్రాచలంలోనే ఉండి వరద ఉధృతిని, సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. పరీవాహకంలో ఉన్న పినపాక, భద్రాచలం నియోజకవర్గాల్లో 49 పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేశారు.

గోదావరి వరదల కారణంగా భద్రాచలం – వెంకటాపురం మార్గంలో వివిధ గ్రామాల్లోకి, రహదారులపైకి వరద నీరు చేరింది. దీంతో ఆయా ప్రాంతాల్లో జనజీవనం అస్తవ్యస్తమైంది.

పలు గ్రామాల్లో ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు సేవలందిస్తున్నాయి. భద్రాచలం వద్ద గురువారం అర్ధరాత్రి 12 గంటలకు 29.70 అడుగులున్న గోదావరి.. వేగంగా పెరుగుతూ శుక్రవారం ఉదయం 8 గంటలకు 40.20 అడుగులకు చేరుకుంది. ఉదయం 10:14 గంటలకు 43 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరికను, మధ్యాహ్నం 3:40 గంటలకు 48 అడుగులకు చేరుకోవడంతో రెండో ప్రమాద హెచ్చరికను భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్‌శ్రేష్ట జారీ చేశారు. అర్ధరాత్రి 53.10 అడుగుల వద్ద ప్రవహిస్తోండటంతో మూడో ప్రమాద హెచ్చరికను కూడా జారీ చేశారు.

ప్రస్తుతం భద్రాచలం వద్ద 14,44,645 క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల్లోని జలాశయాల నుంచి భారీగా నీటిని విడుదల చేస్తుండడంతోపాటు గోదావరి ఉప నదులైన ఇంద్రావతి, ప్రాణహిత, తాలిపేర్ల భారీగా వరద నీరు వస్తోంది. దీంతో శనివారం సాయంత్రానికి భద్రాచలం వద్ద గోదావరి 55 అడుగుల వరకు చేరే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌తోపాటు ఎగువన ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అధిక వర్షం కురుస్తుండడంతో గోదావరికి భారీగా వరద నీరు వస్తోంది.

మైనింగ్ శాఖ నుంచి టెండరు పొందిన కొందరు కాంట్రాక్టర్లు.. చర్ల మండలం వీరాపురంలో ఇసుక ర్యాంపులు నిర్వహిస్తున్నారు. ర్యాంపులో ఇసుక లోడింగ్ కోసం లారీలు వచ్చాయి. లోడింగ్ చేసే సిబ్బందితోపాటు లారీల డ్రైవర్లు కలిపి మొత్తం 46 మంది అక్కడే ఉన్నారు. ఇంతలో వరద ఉధృతి పెరగడంతో గోదావరి పాయ ఒకటి ఆ ఇసుక ర్యాంపు చుట్టుముట్టింది. దీంతో వారంతా ఆ వరదలో చిక్కుకుపోయారు.

సమాచారం అందుకున్న చర్ల తహసీల్దార్ మొగిలి శ్రీనివాసరావు, సీఐ రాజువర్మ తమ సిబ్బందితోపాటు రెస్క్యూ బృందాన్ని వెంటబెట్టుకొని హుటాహుటిన గోదావరి ఒడ్డుకు వెళ్లారు. యంత్రాలు, తెప్పల ద్వారా రెస్క్యూ బృందాలను పంపి పాయలో చిక్కుకున్న అందరినీ సురక్షితంగా ఒడ్డుకు తీసుకొచ్చారు.

అయితే, ర్యాంపులో చిక్కుకున్న వారిని రక్షించేందుకు తెప్పపై వెళ్తున్న చర్ల సీఐ రాజువర్మ.. తృటిలో ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఆయన వెళ్తున్న తెప్ప.. ఒక్కసారిగా తిరిగబడింది. దీంతో వెంటనే ఆయన చాకచక్యంగా అదే తెప్పను పట్టుకొని ఒడ్డుకు చేరారు.

దుమ్ముగూడెం హెడ్ లాకుల ప్రాంతంలో 26 అడుగుల వద్ద గోదావరి ప్రవహిస్తోంది. పుణ్యక్షేత్రమైన పర్ణశాల నారచీరల వద్ద సీతాకుటీరం ప్రదేశం పూర్తిగా నీట మునిగింది. అక్కడ ఉన్న దుకాణ సముదాయాలను అధికారులు, యజమానులు మూసివేశారు. పర్ణశాల రహదారిపైకి వరద నీరు రావడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పర్ణశాలకు వెళ్లకుండానే వెనుదిరుగుతు న్నారు. బైరాగుల పాడు, సున్నంబట్టి గ్రామాల మధ్య ఉన్న రహదారిపైకి వరద నీరు చేరడంతో అధికారులు ఆ మార్గంలో రాకపోకలు నిలిపివేసి బారికేడ్లు ఏర్పాటు చేశారు. తూరుబాక వద్ద ప్రధాన రహదారిపైకి వరద నీరు చేరడంతో భద్రాచలం– చర్ల ప్రధాన రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. మణుగూరు చినరావిగూడెం పుష్కర ఘాట్ వద్ద వరదనీరు పైకి తాకుతూ ఉధృతంగా ప్రవహిస్తోంది.

గోదావరి వరద పెరుగుతున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భద్రాద్రి కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్‌రాజు, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట సూచించారు. వరద ఉధృతిని తమ యంత్రాంగమంతా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందని అన్నారు. భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరికను దాటి గోదావరి ప్రవహిస్తుండడంతో కలెక్టర్, ఎస్పీ, సబ్ కలెక్టర్ తదితర ఉన్నతాధికారులు శుక్రవారం గోదావరి కరకట్టపైకి వచ్చి వరద ఉధృతిని పరిశీలించారు. విస్తా కాంప్లెక్స్ స్లూయిజ్ వద్ద వరద నీటి పారుదల పరిస్థితి, మోటర్ల పనితీరు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్నానఘాట్ల వద్ద పరిస్థితిని పరిశీలించారు. గోదావరిలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలను అనుమతించవద్దని స్పష్టం చేశారు.

నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. కూనవరం – భద్రాచలం ప్రధాన రహదారిపై గోదావరి వరద నీరు ఎకడ వరకు చేరిందనే వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వరద 53 అడుగులకు చేరితే మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. వరద పెరిగినా సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. భద్రాచలం ఫ్లడ్ కంట్రోల్ రూమ్ 24 గంటలపాటు పనిచేస్తోందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 08744-241950, 08743- 232444 నంబర్లకు ఫోన్ చేయొచ్చునని, 9392919743 నంబరుకు వాట్సాప్ ద్వారా సమాచారం అందించొచ్చునని సూచించారు.

అధికారిక సమాచారాన్ని మాత్రమే ప్రజలు విశ్వసించాలని సూచించారు. సెల్ఫీలు, వీడియోల కోసం వరద వద్దకు వెళ్లవద్దని; అత్యవసర పరిస్థితుల్లో 100కు డయల్ చేయాలని ఎస్పీ సూచించారు.

# మీరాబాయి చానూకు అర్జున పురస్కారం ఇవ్వాలని కేంద్ర ఆయుష్ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ సిఫార్సు

న్యూఢిల్లీ, ఆగష్టు 1:భారత ప్రముఖ వెయిట్‌లిఫ్టర్, ఒలింపిక్ పతక విజేత మీరాబాయి చానూకు ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక అర్జున అవార్డు కేటాయించాలని కేంద్ర ఆయుష్ (స్వతంత్ర హోదా), వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ ప్రతాప్‌రావ్ గణపత్‌రావ్ జాదవ్ కోరారు. ఈ మేరకు కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయకు ఆయన లేఖ రాశారు.

లేఖలో మీరాబాయి చానూ సాధించిన అసాధారణ విజయాలను, భారతీయ వెయిట్‌లిఫ్టింగ్ రంగానికి ఆమె అందించిన అత్యుత్తమ సేవలను కేంద్ర మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ ప్రస్తావించారు. మణిపూర్‌కు చెందిన ఈ క్రీడాకారిణి కామన్వెల్త్ క్రీడల్లో అద్భుతమైన ప్రదర్శనలతో చరిత్ర సృష్టించి దేశానికి ఎంతో గర్వకారణంగా నిలిచిందని పేర్కొన్నారు.

కామన్వెల్త్ క్రీడల్లో వరుసగా స్వర్ణ పతకాలు సాధించిన మీరాబాయి చానూ అద్భుతమైన రికార్డును కేంద్రమంత్రి కొనియాడారు. ఆయా పోటీల్లో ప్రతిసారీ భారత్‌కు తొలి స్వర్ణ పతకాన్ని అందించిన క్రీడాకారిణిగా ఆమె నిలిచారని గుర్తుచేశారు. 48 కేజీల విభాగంలో స్నాచ్, క్లీన్ అండ్ జెర్క్, ఆల్‌రౌండ్ విభాగాల్లో అత్యధిక బరువులు ఎత్తి రికార్డులు తిరగరాసిన తీరును మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

మీరాబాయి చానూ ఇప్పటికే ఒలింపిక్ పతకంతో పాటు మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న, పద్మశ్రీ వంటి దేశ అత్యున్నత క్రీడా పురస్కారాలను అందుకున్నారని కేంద్ర మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ గుర్తుచేశారు. మణిపూర్‌లోని తన గ్రామంలో శిక్షణ ప్రారంభించిన తొలి రోజుల్లో ఏర్పడిన అర్జున అవార్డు తీసుకోవాలనే ఆమె చిన్ననాటి కల మాత్రం ఇప్పటికీ నెరవేరకుండానే ఉండిపోయిందని అన్నారు.

ఈ ప్రతిపాదనను పరిశీలించాలని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిని కోరుతూ.. మీరాబాయి చానూను అర్జున అవార్డుతో సత్కరించడం ద్వారా ఆమె అసాధారణ ప్రతిభకు, భారతీయ క్రీడలకు అందించిన అమూల్యమైన సేవలకు తగిన గుర్తింపు లభిస్తుందని శ్రీ ప్రతాప్‌రావు జాదవ్ తెలిపారు.

మణిపూర్‌లోని ఒక చిన్న గ్రామం నుంచి ప్రయాణం ప్రారంభించి దేశపు అత్యంత ప్రతిభావంతులైన వెయిట్‌లిఫ్టర్లలో ఒకరిగా ఎదిగిన చానూ ప్రయాణం ఆమె పట్టుదల, నిరంతర కృషి, అంకితభావానికి ప్రత్యక్ష నిదర్శనమని మంత్రి కొనియాడారు. ఆమె విజయాలు లక్షలాది మంది యువ భారతీయులకు నిరంతరం స్ఫూర్తినిస్తాయని చెప్పారు.

# పరిశోధన-భాగస్వామ్యంతో సంప్రదాయ వైద్య ఔచిత్యం ధ్రువీకరణ

న్యూఢిల్లీ, ఆగష్టు 1:సంప్రదాయ వైద్య పద్ధతులు–మూలికా ఉత్పత్తుల సేకరణ, నమోదులో 'సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేదిక్ సైన్సెస్' (సీసీఆర్ఏఎస్) చురుగ్గా వ్యవహరిస్తోంది. ఈ మేరకు గిరిజన ఆరోగ్య సంరక్షణ పరిశోధన కార్యక్రమం (టీహెచ్‌సీఆర్‌పీ), వైద్య–జాతి–వృక్ష శాస్త్ర సర్వే (ఎంఈబీఎస్) కార్యక్రమాలను అమలు చేస్తోంది. ఆయుర్వేద ఆరోగ్య సంరక్షణ సేవల ప్రదానంతోపాటు ఆరోగ్య కార్యక్రమాలు, వ్యాధి నివారణాధారిత దినచర్య, రుతుచర్య, పథ్య–అపథ్య తదితర ఆయుర్వేద జీవనశైలి పద్ధతులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వీటి లక్ష్యం. ఇందులో సమాచార–అవగాహన–ప్రచార (ఐఈసీ) సామగ్రి పంపిణీ, స్థానిక ఆరోగ్య సంప్రదాయాలు (ఎల్‌హెచ్‌టీ), జానపద పద్ధతుల నమోదు (ఈఎంపీ) కూడా అంతర్భాగంగా ఉంటాయి. తదనుగుణంగా ఎల్‌హెచ్‌టీ, ఈఎంపీ సహా జానపద విధానాల ప్రత్యేకత–నవ్యత్వం దిశగా మండలి ద్వారా నమోదుతో ధ్రువీకరణ ప్రక్రియను చేపడతారు.

సముచిత శాస్త్రీయ ధ్రువీకరణ, ప్రామాణికత, నైతిక ఆమోదిత జాతి వైద్య పద్ధతులు, గిరిజన–జానపద విధానాధారిత సంప్రదాయ ఆరోగ్య పద్ధతులు, ఇతర సామాజిక ఆరోగ్య సంరక్షణ సంప్రదాయాలపై క్లినికల్, ట్రాన్స్‌లేషనల్ పరిశోధనలను న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద (ఏఐఐఏ) చేపడుతుంది. ఈ సంప్రదాయ ఆరోగ్య సంరక్షణ పద్ధతుల పరిరక్షణ, సామర్థ్యం, చికిత్స ఫలితాల సంబంధిత నిదర్శనాల దిశగా సుస్థిర శాస్త్రీయ పద్ధతులలో పరిశోధనలు నిర్వహిస్తారు.

సమగ్ర ఆరోగ్య పరిశోధనను ప్రోత్సహించే లక్ష్యంతో ఆయుష్ మంత్రిత్వ శాఖ, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) మధ్య 2023 మే 11న అవగాహన ఒప్పందం కుదిరింది. ఆయుష్ మంత్రిత్వ శాఖ, ఐసీఎంఆర్ మధ్య ఆరోగ్య పరిశోధనపై సహకారంతో పాటు సమన్వయాన్ని ప్రోత్సహించడం ఈ ఒప్పందం లక్ష్యం. అలాగే రూపకల్పన, సమగ్ర ఆరోగ్య పరిశోధన దిశగా సహకారం–సమన్వయంపై అవకాశాల అన్వేషణ, రెండింటి పరిధిలోని శాస్త్రవేత్తల పరిశోధన సామర్థ్య బలోపేతంపైనా ఇది దృష్టి సారిస్తుంది.

ఐసీఎంఆర్, ఆయుష్ మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇతర పరిశోధన మండలాలు, ఎయిమ్స్ సహా ఇతర వైద్య, పరిశోధన, విద్యాసంస్థల సహకారంతో సమగ్ర ఆరోగ్య పరిశోధనలో సీసీఆర్ఏఎస్ పాలుపం చుకుంటోంది. ఆయుష్–ఐసీఎంఆర్ సంయుక్త సహకారంతో, "పునరుత్పత్తి వయసుగల సాధారణ మహిళల్లో మధ్యస్థ ఐరన్ లోప రక్తహీనత చికిత్సలో ఐరన్ ఫోలిక్ యాసిడ్‌తో పోలిస్తే, 'పునర్నవాది మండూర'ను విడిగా లేదా ద్రాక్షావలేహ్యంతో కలిపి వాడితే లభించే ఉపశమనం, భద్రత: మూడు విభాగాలతో కూడిన సామాజికాధారిత బహుళ–కేంద్రక యాదృచ్ఛిక నియంత్రిత పరీక్ష'' పేరిట అధ్యయనం పూర్తయింది.

సంప్రదాయ వైద్య విధానాలకు శాస్త్రీయ ఆధారాల సృష్టి లక్ష్యంగా జైపూర్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద (ఎన్ఐఏ), ఇతర ఆధునిక వైద్య సంస్థల మధ్య సహకారం ద్వారా వివిధ వ్యాధి పరిస్థితులపై సమీకృత చికిత్స విధానాలను ఉపయోగిస్తున్నారు.

షిల్లాంగ్‌లోని నార్త్ ఈస్టర్న్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద అండ్ హోమియోపతి సంస్థ (ఎన్ఈఐఏహెచ్) రోగుల ప్రయోజనార్థం సమగ్ర ఆరోగ్య సంరక్షణ దిశగా తమ ఆసుపత్రిలో ఫిజియోథెరపీ, దంతవైద్యం, ఆహార నియమాలు తదితర ఆధునిక పద్ధతులను అనుసంధానించింది.

అంతేగాక, ఆయుర్వేద విధానంలో వ్యాధి నిర్ధారణకు అనుబంధంగా ప్రయోగశాల, రేడియాలజీ విధానాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తోంది. తప్పనిసరి రొటేటరీ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లో భాగంగా మేఘాలయ ప్రభుత్వ ఆధ్వర్యంలోని వివిధ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు శిక్షణార్థులను పంపడం ద్వారా 'ఎన్ఈఐఏహెచ్' ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో కలసి కృషి చేస్తోంది.

ఇక 'ఏఐఐఏ'లో ఐసీయూ విభాగం సహా 200 పడకల తృతీయ అంచె ఆరోగ్య సంరక్షణ కేంద్రం పనిచేస్తోంది. ఆయుర్వేదానికి ఒక సమగ్ర ఆదర్శ వైద్యవిధాన ఆసుపత్రిగా ఇది బాధ్యతలు నిర్వర్తిస్తుంది. వివిధ క్లినికల్, పారా క్లినికల్ విభాగాలలో ఆధునిక వైద్య నిపుణులు కూడా ఇక్కడ పనిచేస్తున్నారు. ఝజ్జర్‌లోని 'ఎయిమ్స్'లో సమగ్ర కేన్సర్ క్లినిక్, పరిశోధన కేంద్రాన్ని, న్యూఢిల్లీలోని 'విఎం' మెడికల్ కాలేజీ అనుబంధ సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో సమగ్ర వైద్య కేంద్రాన్ని 'ఏఐఐఏ' ఏర్పాటు చేసింది.

కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్ఎస్) కింద అల్లోపతి, ఆయుష్ వైద్య విధానాల ద్వారా ఆరోగ్య సంరక్షణ సేవలు లభిస్తాయి. ఈ పథకం లబ్ధిదారులు రెండు విధానాలలో దేని ద్వారానైనా చికిత్స పొందే వీలుంది. లబ్ధిదారుని క్లినికల్ పరిస్థితి, వైద్య అవసరాలు, వైద్యుల వృత్తిపరమైన అంచనాలపై చికిత్స ఎంపిక ఆధారపడి ఉంటుంది.

కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) శ్రీ ప్రతాపరావు జాదవ్ ఈ రోజు లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక జవాబిస్తూ ఈ సమాచారం వెల్లడించారు.

# భారీ పెట్టుబడి మోసం కేసును ఛేదించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు



ఖమ్మం, ఆగష్టు 1: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నెం.134/2026 కేసులో ప్రధాన నిందితుడు బేతంపూడి భరత్ కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుండి నేరార్జిత ఆస్తులుగా భావిస్తున్న 35 వాహనాలు, ఇతర చరాస్తులను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. శనివారం కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ కేసు వివరాలను వెల్లడించారు. భార్వాటీ శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. నిందితుడు భద్రాచలం ఐటీసీ పేపర్ బోర్డ్స్‌లో లేబర్ కాంట్రాక్టర్‌గా పని చేస్తున్నానని తెలిపేవాడన్నారు. తనతో భాగస్వామిగా ఉంటే కాంట్రాక్ట్ పనులు ఇప్పించి అధిక లాభాలు అందిస్తానని నమ్మబలికి పలువురు బాధితుల నుండి సుమారు రూ.52 కోట్ల మేర పెట్టుబడుల పేరుతో మోసపూరితంగా డబ్బులు సేకరించినట్లు వెల్లడించారు.

బాధితుల విశ్వాసాన్ని పొందేందుకు నకిలీ భాగస్వామ్య ఒప్పందాలు, తప్పుడు పత్రాలు రూపొందించి, లాభాల్లో 4 శాతం వాటా ఇస్తామని హామీలు ఇచ్చి మోసానికి పాల్పడ్డాడు. అలాగే బీకే నాయుడు అండ్ కో, రాజేశ్వరి ట్రావెల్స్ పేర్లతో సంస్థలను నిర్వహిస్తూ ఈ మోసపూరిత కార్యకలాపాలు సాగించినట్లు గుర్తించామన్నారు. సాంకేతిక ఆధారాలు, ఆర్థిక లావాదేవీల విశ్లేషణ ఆధారంగా నిందితుడిని కేరళ రాష్ట్రంలోని పాలా ప్రాంతంలో అరెస్టు చేసి, ట్రాన్సిట్ వారెంట్‌పై జిల్లాకు తీసుకువచ్చి పోలీసు కస్టడీలో విచారించినట్లు తెలిపారు. విచారణలో భాగంగా నేరార్జిత ఆస్తులుగా భావిస్తున్న 6 బస్సులు, ఒక వాటర్ ట్యాంకర్ లారీ, 3 ట్రాక్టర్లు, 2 వ్యవసాయ పరికరాలు, 7 కార్లు, 14 ద్విచక్ర వాహనాలు, 2 ట్రైలర్లు కలిపి మొత్తం 35 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా బాధితుల నుంచి మోసపూరితంగా సేకరించిన డబ్బుతో భద్రాచలంలోని రాజీవ్‌నగర్ కాలనీలో మూడు అంతస్తుల భవనం, ఒక ప్లాట్ కొనుగోలు చేసినట్లు గుర్తించినట్లు తెలిపారు.

అధిక లాభాలు వస్తాయని, తక్కువ సమయంలో పెట్టుబడికి రెట్టింపు లేదా భారీ రాబడులు వస్తాయని చెప్పే వ్యక్తులు లేదా సంస్థలను గుడ్డిగా నమ్మి డబ్బులు పెట్టవద్దని ప్రజలకు సూచించారు. ఆకర్షణీయమైన హామీలు, నకిలీ పత్రాలు, తప్పుడు ఒప్పందాలతో మోసగాళ్లు ప్రజలను మభ్యపెడుతున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. అనుమానాస్పద పెట్టుబడి పథకాలపై సమాచారం తెలిసినా లేదా మోసానికి గురైనా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజల అప్రమత్తతతోనే ఇటువంటి ఆర్థిక నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో కృషి చేసిన లక్ష్మీదేవిపల్లి పోలీసు సిబ్బందిని, జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అభినందించారు.

# ప్రధాని మోదీని తిడుతుంటే

## నా గుండె కదిలింది.. కన్నీళ్లొచ్చాయి : పవన్ కల్యాణ్



న్యూఢిల్లీ, ఆగష్టు 1: ప్రధానమంత్రి నరేంద్రమోదీని చాలా మంది జెన్ జీ యువత తిడుతుంటే, ఆయనను అనకూడని మాటలు అంటుంటే నా గుండె కదిలింది. కన్నీళ్లొచ్చాయని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని భోగాపురంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించారు. అనంతరం జాతికి అంకితం చేశారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. దేశం కోసం కష్టపడేవారికి ఇవా మనం చివరకు ఇచ్చేదన్నారు. కొత్త తరానికి ఏం తెలుసు ఆయన (ప్రధాని) పడ్డ కష్టం. మన ప్రధాన మంత్రి ఒక్క రోజు కూడా సెలవు తీసుకోలేదు. ఈ రోజు మనకు పెట్టుబడులు వస్తున్నాయి. శత్రు దేశాలు, మన అభివృద్ధికి ఈర్ష్య పడే పశ్చిమ దేశాలను తట్టుకుని.. ఓ వైపు విదేశాల్లో ఉండే శత్రువులతో పోరాడాలి. దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తా ఉంటే అంతర్గత శత్రువులతో పోరాడాలి. అలాంటి వ్యక్తికి మనం ఇవ్వగలిగేది.. కేవలం మేమున్నాం.. మీ వెంట. మీ మీద మాట పడితే అది మా మీద పడ్డట్టే.. ఇదే మనం వారికివ్వాల్సిందన్నారు

# మాల్దీవులకు కర్ణాటక నీలమ్, తోతాపురి మామిడిపళ్లు..

న్యూ ఢిల్లీ, ఆగష్టు 1:నీలమ్, తోతాపురి రకాల మామిడిపళ్లను కర్ణాటక నుంచి మాల్దీవులకు మొదటిసారిగా విమానంలో ఎగుమతి చేయడానికి అగ్రికల్చరల్, ప్రాసెస్డ్ ఫుడ్ ప్రాడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఏపీఈడీఏ.. 'అపెడా') సహకరించింది. కర్ణాటకలో సీజను దాటాక వచ్చే ఈ రకాలకు చెందిన మామిడి పండ్ల ఎగుమతి కార్యక్రమాన్ని నిన్న.. అంటే 2026 జులై 30న ప్రారంభించారు. ఈ రెండు రకాల మామిడి పండ్లను అంతర్జాతీయ మార్కెట్లకు చేరవేయడాన్ని ప్రోత్సహించడంలోనూ, భారత మామిడిపండ్ల ఎగుమతుల్ని మరింత విస్తరించడంలోనూ ఈ కార్యక్రమం ఓ కీలక ఘట్టంగా నిలిచింది.

సరుకు ఎగుమతి కార్యక్రమాన్ని అపెడా ఛైర్మన్, ఐఏఎస్ అధికారి శ్రీ అభిషేక్ దేవ్ ప్రారంభించారు. దీనికి వెన్నుదన్నుగా నిలిచిన ఎగుమతి సంస్థనీ, ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ (ఎఫ్‌పీసీ)నీ, రైతుల్నీ, మిగతా ఆసక్తిదారుల్నీ ఆయన అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు భారతదేశ మామిడిపండ్లకు మార్కెట్ లభ్యతను పెంచుతాయనీ, ఆలస్యంగా పండే రకాలకు ఎగుమతి అవకాశాల్ని అందించడంతో పాటు రైతులు తమ ఆదాయాన్ని పెంచుకోవడానికి కూడా తోడ్పడాయనీ శ్రీ అభిషేక్ దేవ్ అన్నారు.

కర్ణాటక.. కోలార్ జిల్లాలో కేజీఎఫ్ తాలూకాకు చెందిన ప్రాకృతిక్ మాయా ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీతో కలిసి పనిచేస్తున్న రైతుల వద్ద నుంచి ఒక మెట్రిక్ టన్ను నీలమ్, తోతాపురీ మామిడి పండ్ల ఎగుమతి సరుకును సేకరించారు. ఈ సరుకును అహల్యా దేవి వెంచర్స్ డైరెక్టరు శ్రీమతి ఎ.అశ్వినీ ఆధ్వర్యంలో ఎగుమతి చేశారు. శ్రీమతి ఎ.అశ్వినీ కొత్తగా నమోదైన మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్త, ఎగుమతిదారు. భారత వ్యవసాయ ప్రధాన ఎగుమతుల విస్తారిత అనుబంధ వ్యవస్థలో మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల భాగస్వామ్యం అంతకంతకూ పెరుగుతోందని ఈ ఎగుమతి కార్యక్రమం చాటిచెబుతోంది.

నీలమ్ మామిడిపండ్లు తీయదనానికీ, రసాన్నిచ్చే గుజ్జుకీ, చక్కనైన సువాసనకీ పేరు పొందాయి. వీటిని మిఠాయిలు, స్మూదీలు, పానీయాల తయారీకి కూడా ఉపయోగిస్తారు. తోతాపురీ మామిడిపండ్లు తీపి, పులుపు రుచుల కలగలుపుగా ఉండి నేరుగా వాడుకోవడానికీ, శుద్ధి చేసి వాడటానికీ అనువైనవని ప్రసిద్ధి చెందాయి.

# జాతీయ పతాక రూపకర్త "పింగళి వెంకయ్య"


భారతీయులు సగర్వంగా, సగౌరవంగా తలెత్తి వందనం చేసే, భారత సార్వభౌమాధికారానికి ప్రతీక అయిన త్రివర్ణ పతాక రూపకర్త పింగళి వెంకయ్య. స్వాతంత్ర్య సమర యోధునిగా, వ్యవసాయ, భూగర్భ ఖనిజ శాస్త్రవేత్తగా, జపనీస్ భాషా బోధకునిగా, చిత్రకారునిగా, వివిధ దేశాల పర్యాటకునిగా, బహుముఖ ప్రజ్ఞ కలిగిన వెంకయ్యను భారతీయులంతా గుర్తు చేసుకోవాల్సిన సందర్భం అనివార్యం. 1878 ఆగస్టు 2న కృష్ణాజిల్లా పెద్ద కళ్ళేపల్లెలో, జన్మించిన వెంకయ్య, భట్లపెనుమర్రిలో విద్యాభ్యాసం ముగించుకొని, తన 19 వ ఏట ముంబై వెళ్లి సైన్యంలో చేరారు.

మద్రాసులో ప్లేగు ఇనస్పెక్టరు శిక్షణ పూర్తి చేసి, కొంతకాలం బళ్లారిలో ప్లేగ్ ఇనస్పెక్టరుగా పనిచేసారు. అతని జ్ఞాన దాహం అంతులేనికి. శ్రీలంక వెళ్ళి కొలంబోలోని సిటీ కాలేజీలో పొలిటికల్ ఎకనమిక్స్ ప్రత్యేక విషయంగా చదివి కేంబ్రిడ్జ్ సీనియర్ పరీక్షలో ఉత్తీర్ణుడయ్యారు. కొంతకాలం రైల్వేలో గార్డుగా పనిచేసాడు. ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి లాహోర్ లోని డి.ఎ.వి. కాలేజీలో చేరి, సంస్కృతం, ఉర్దూ, జపాన్ భాషల్లో మంచి పాండిత్యం సంపాదించారు. జపాన్ భాషలో అనర్గళంగా మాట్లాడే వెంకయ్య గారిని "జపాన్ వెంకయ్య" అని పిలిచేవారు.

1899 - 1902 మధ్య డచ్ సైన్యానికి వ్యతిరేకంగా, దక్షిణాఫ్రికాలో బోయర్ యుద్ధంలో పాల్గొన్నారు. అక్కడే ఆయనకు స్వాతంత్రోద్యమ నిర్దేశకులు, భావిభారత జాతిపిత మహాత్మా గాంధీతో పరిచయం ఏర్పడింది. దక్షిణాఫ్రికాలో ఉండగా మహాత్మా గాంధీని కలిశారు. గాంధీతో వెంకయ్యకు ఏర్పడిన ఈ సాన్నిహిత్యం అర్ధశతాబ్దం పాటు నిలిచింది. భూగర్భ ఖనిజ శాస్త్రవేత్తగా మైకా, వజ్రాలపై ఆయన విస్తృత పరిశోధనలు జరిపారు. స్వదేశం వసర్తా అరేబియా, ఆఫ్ఘనిస్థాన్ లు చూచి వచ్చారు. గాంధీజీ పరిచయం అయిన నాటి నుండి జాతీయ జెండా ఎలా ఉండాలనే సమస్యనే తన అభిమాన విషయంగా పెట్టుకొని, దాని గురించి దేశంలో ప్రచారం ప్రారంభించారు. 1913 నుండి ప్రతి కాంగ్రెస్ సమావేశానికి హాజరై, నాయకులందరితోనూ జాతీయ పతాక రూపకల్పన గురించి చర్చలు జరిపారి.

1916లో "భారత దేశానికి ఒక జాతీయ పతాకం" అనే ఆంగ్ల గ్రంథాన్ని రచించారు.

1916 లో "నీడ్ ఫర్ నేషనల్ ఫ్లాగ్" పేరున 30 నమూనాలతో జాతీయ పుస్తక రచన గావించారు. ఈ గ్రంథానికి అప్పటి వైస్రాయ్ కార్యనిర్వాహక సభ్యుడైన కేంద్రమంత్రి సర్ బి.ఎన్.శర్మ ఉత్తేజకరమైన పీఠిక రాశారు. 1916లో లక్నోలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో వెంకయ్య తయారు చేసిన జాతీయ జెండానే ఎగుర వేశారు. 1919లో జలంధర్ వాస్తవ్యులైన "లాలా హన్స్ రాజ్" మన జాతీయ పతాకంపై రాట్నం చిహ్నముంటే బాగుంటుందని సూచించగా గాంధీజీ దాన్ని అంగీకరించారు. 1921లో అఖిల భారత కాంగ్రెస్ సమావేశాలు బెజవాడలో జరిగాయి. గాంధీజీ వెంకయ్యను ఆ సమావేశానికి పిలిపించి కాషాయం, ఆకుపచ్చ రంగులు కలిగి, మధ్య రాట్నంగల ఒక జెండాను చిత్రించమని కోరారు. మహాత్ముడు సూచించిన ప్రకారం



ఆగస్టు 2... వెంకయ్య వర్ధంతి

గానే, ఒక జెండాను సమకూర్చాడు వెంకయ్య. అనంతరం వచ్చిన ఆలోచనల మేరకు, సత్యం, అహింసలకు ప్రత్యక్ష నిదర్శనమైన, తెలుపు రంగు కూడా ఉండాలని గాంధీజీ అభిప్రాయ పడగా, వెంకయ్య ఆ జెండాలో అదనంగా తెలుపు రంగును చేర్చి, నేటి త్రివర్ణ పతాకాన్ని దేశానికి ప్రసాదించారు.

"మడత పెడితే విడికెడే కానీ, కోటానుకోట్ల భారతీయుల ప్రియ వస్త్రం"గా "గాంధీజీ"చే, వెంకయ్య రూపకల్పన చేసిన జాతీయ పతాకం ప్రశంసా పాత్రమైంది.

1947, జూలై 22 వ తేదీన భారత రాజ్యాంగ సభలో నెహ్రూ జాతీయ జెండా గురించి ఒక తీర్మానం చేస్తూ, మునుపటి త్రివర్ణ జెండాలోని రాట్నాన్ని తీసేసి, దాని స్థానంలో అశోకుని ధర్మచక్రాన్ని చిహ్నంగా ఇమిడ్చారు. చిహ్నం మార్పు తప్పితే పింగళి వెంకయ్య రూపొందించిన జెండాకు నేటి జెండాకు తేడా ఏమీ లేదు. అశోకుని ధర్మచక్రం మన పూర్వ సంస్కృతికి సంకేతం.

పింగళి వెంకయ్య 1906 నుంచి 1922 వరకు భారత జాతీయోద్యమం లోని వివిధ ఘట్టాలలో పాల్గొన్నారు. వందేమాతరం, హోమ్‌రూల్ ఉద్యమం, ఆంధ్రోద్యమంలాంటి ప్రసిద్ధ ఉద్యమాలలో ప్రధాన పాత్రధారిగా ఉన్నారు. భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత ఆయన బెంగుళూరు, మద్రాసు లలో "రైల్వే గార్డు"గా పనిచేశారు. ఆ తరువాత కొంత కాలము బళ్లారిలో "ప్లేగు అధికారి"గా ప్రభుత్వ ఉద్యోగము చేశారు. వెంకయ్యలో ఉన్న దేశభక్తి ఆయనను ఎంతో కాలము ఉద్యోగము చేయనివ్వలేదు.

1906 నుండి 1922 వరకు జాతీయోద్యమాలతో పాటు మునగాల పరగణా నడిగూడెంలో జమీందారు రాజా బహదూర్ నాయని రంగారావు కోరిక మేరకు, నడిగూడెంలో నివాసముండి, పత్తి మొక్కల లోని వేలు రకముల పరిశోధనలో వినియోగించారు. నడిగూడెంలో వ్యవసాయ క్షేత్రాన్ని నిర్మించాడు. ఈ పరిశోధనలలో "కంబోడియా పత్తి" అను ఒక ప్రత్యేక రకమైన పత్తి మీద విశేష కృషి చేశారు. ఆయన కృషిని ఆనాటి బ్రిటీషు ప్రభుత్వముకూడా గుర్తించడముతో ఆయనకు "పత్తి వెంకయ్య" అని పేరు వచ్చింది.

తరువాత నెల్లూరు చేరి, 1924 నుండి 1944 వరకు అక్కడే ఉంటూ మైకా (అభ్రకం) గురించి పరిశోధన చేశారు. వజ్రకరూరు, హంపిలలో ఖనిజాలు, వజ్రాలు గురించి విశేషంగా పరిశోధనలు జరిపి ప్రపంచానికి తెలియని వజ్రపు తల్లిరాయి అనే గ్రంథం రాసి 1955లో దాన్ని ప్రచురించారు. దేశానికి స్వాతంత్ర్యం లభించిన తరువాత ప్రభుత్వం వెంకయ్యను ఖనిజ పరిశోధక శాఖ సలహాదారుగా నియమించింది. ఆ పదవిలో ఆయన 1960 వరకు పనిచేసారు.

అయితే వెంకయ్య జీవిత చరమాంకం దయనీయ స్థితిలో ముగిసింది. 1960 లో భారత ప్రభుత్వం భూగర్భ ఖనిజాలు సంస్థ సలహాదారునిగా వెంకయ్యకు ఇచ్చే గౌరవ వేతనాన్ని సైతం నిలిపి వేసింది. వృద్ధాప్యంలో ఆర్థిక బాధలు ఆయనను చుట్టు ముట్టాయి. మిలటరీలో పని చేసినందుకు విజయవాడ చిట్టినగరులో ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో, ఆయన గుడిసె వేసుకొని దారిద్ర్య జీవితాన్ని గడపవలసి వచ్చింది. జీవితాంతం దేశం కొరకు, స్వాతంత్ర్యం కొరకు పోరాడిన వెంకయ్య చివరి రోజుల్లో తిండికి కూడా మొహం వాచి, నానా అగచాట్లు పడినట్లు ' త్రివేణి ' సంపాదకులు డా. భావరాజు నరసింహారావు పేర్కొన్నారు. అంతిమదశలో విజయవాడలో డా. కె.ఎల్.రావు, డా.టి.వి.ఎస్.చలపతిరావు, కాట్రగడ్డ శ్రీనివాసరావు మున్నగు పెద్దలు 1963 జనవరి 15న వెంకయ్యను సత్కరించి, కొంత నిధిని అందించారు. కన్నుమూసే ముందు ఆయన చివరి కోరికను వెల్లడిస్తూ " నా అంత్య దశ సమీపించింది. నేను చనిపోయిన తర్వాత త్రివర్ణ పతాకాన్ని నా భౌతిక కాయంపై కప్పండి. శ్మశానానికి చేరిన తర్వాత ఆ పతాకం తీసి అక్కడ ఉన్న రావి చెట్టుకు కట్టండి. ఇది నా తుది కోరిక " అన్నారు.

ఆత్మాభిమానానికి మారుపేరైన వెంకయ్య, కడు పేదరికాన్ని అనుభవిస్తూ, 1963 జూలై 4న విజయవాడలో తుది శ్వాస వదిలారు. 1964 లో జూలైలో నాటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి, వెంకయ్య చిత్రపటాన్ని ఆవిష్కరించినా, విజయవాడ గాంధీ హాల్ నందు విగ్రహావిష్కరణ జరిగినా, భారతీయులు ఆచంద్ర తారార్కం గుర్తుంచుకోవలసిన పింగళి వెంకయ్యకు... రావలసిన గౌరవం రాకపోవడం నిజంగా బాధాకరం. గత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైదరాబాదులో ట్యాంక్ బండ్ పై ఆయన కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేసి ఆయన దర్శన భాగ్యం ప్రజలకు లభింపజేసి, కొంతలో కొంతైనా ప్రజలకు గుర్తుండేలా చేసింది.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

## పేటెంట్లు, అవార్డు గ్రహీతల పోర్ట్‌ఫోలియోను పెంచుకుంటూ మేధో సంపత్తి సృష్టిలో రాణిస్తోన్న టెలిమాటిక్స్ డెవలప్‌మెంట్ సెంటర్

న్యూఢిల్లీ, ఆగష్టు 1:భారత ప్రభుత్వ కమ్యూనికేషన్స్ మంత్రిత్వ శాఖకు చెందిన టెలికమ్యూనికేషన్స్ విభాగం (డీఓటీ) ఆధ్వర్యంలోని ప్రముఖ టెలికాం పరిశోధన, అభివృద్ధి సంస్థ అయిన సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్ (సీ-డాట్.. మేధో సంపత్తి (ఐపీ) రంగంలో తన ఢిల్లీ క్యాంపస్ అందించిన అత్యుత్తమ కృషిని గుర్తించి, అభినందించేందుకు 'వార్షిక ఐపీ అవార్డుల ప్రదానోత్సవం-2026'ను నిర్వహించింది.

భారత స్వదేశీ టెలికాం సాంకేతిక వ్యవస్థను బలోపేతం చేయడం, సాంకేతిక ఆధారిత వృద్ధి దిశగా దేశ దృక్పథాన్ని ముందుకు తీసుకెళ్లడంలో విశేష కృషి చేస్తున్న సీ-డాట్ పరిశోధకులు, ఆవిష్కర్తలను ఈ వేడుకలో సత్కరించారు.

సీ-డాట్ ఢిల్లీ క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమంలో 47 పేటెంట్లు, 3 కాపీరైట్లు, 8 పరిశోధనా పత్రాలను గుర్తించి అభినందించారు. నూతన ఆవిష్కరణలు, శ్రేష్ఠత విషయంలో చేసిన కృషికి గుర్తిస్తూ ఈ క్యాంపస్‌కు చెందిన మొత్తం 64 మందికి అవార్డులను ప్రదానం చేశారు. సీ-డాట్ మేధో సంపత్తి పోర్ట్‌ఫోలియోను గణనీయంగా బలోపేతం చేసిన పరిశోధకులు, ఇంజనీర్లు, విషయ నిపుణుల అసాధారణ కృషిని ఈ వేడుక కొనియాడింది. స్థిరంగా విస్తరిస్తున్న పేటెంట్ పోర్ట్‌ఫోలియో, గుర్తింపు పొందుతోన్న శ్రేష్ఠమైన ఆవిష్కర్తలు పెరగటంతో స్వదేశీ సాంకేతిక ఆవిష్కరణలను నడిపించే అగ్రగామి టెలికాం ఆర్-డీ సంస్థగా సీ-డాట్ తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంటోంది. భారత సాంకేతిక స్వావలంబన, డిజిటల్ రూపాంతర దృక్పథానికి తోడ్పడే పరిశోధన శ్రేష్ఠత, మేధో సంపత్తి సృష్టి, ప్రపంచవ్యాప్తంగా పోటీపడే సాంకేతికతల అభివృద్ధి పట్ల సంస్థ నిరంతర నిబద్ధతను ఈ విజయాలు చాటుతున్నాయి.

అవార్డు గ్రహీతలను అభినందించిన సీ-డాట్ సీఈఓ డాక్టర్ రాజ్‌కుమార్ ఉపాధ్యాయ్ మాట్లాడుతూ... "దేశం కోసం స్వదేశీ, సురక్షితమైన, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న టెలికాం సాంకేతికతలను రూపొందించాలనే సీ-డాట్ మిషన్‌కు ఆవిష్కరణే ప్రధాన ఆధారం. మా పరిశోధకులు సృష్టించిన ప్రతి పేటెంట్, ప్రచురణ, మేధో సంపత్తి భారతదేశ సాంకేతిక సార్వభౌమత్వాన్ని బలోపేతం చేస్తాయి.. 'ఆత్మనిర్భర్ భారత్' దృక్పథం పట్ల మా నిబద్ధతను మరింత బలపరుస్తాయి. ఈ అవార్డులు అసాధారణమైన సాంకేతిక నైపుణ్యాన్నే కాకుండా సీ-డాట్ పరిశోధనా వ్యవస్థను నడిపించే జిజ్ఞాస, పట్టుదల, ఆవిష్కరణ స్ఫూర్తిని కూడా గుర్తిస్తాయి. అవార్డు గ్రహీతలందరికీ నా అభినందనలు. భారత్ గ్లోబల్ టెలికాం ఆవిష్కరణ లీడర్‌గా అవతరించడానికి దోహదపడే పరివర్తనాత్మక సాంకేతికతలను అభివృద్ధి చేయడాన్ని వారు కొనసాగించాలని నేను కోరుతున్నాను" అని అన్నారు.

గత కొన్నేళ్లుగా సీ-డాట్ భవిష్యత్‌తరం కమ్యూనికేషన్ సాంకేతికతలు, సైబర్ భద్రత, క్వాంటం కమ్యూనికేషన్స్, విపత్తు నిర్వహణ వ్యవస్థలు, ఏఐ ఆధారిత టెలికాం పరిష్కారాలు, డిజిటల్ ప్రజా మౌలికసదుపాయాలు వంటి రంగాల్లో బలమైన మేధో సంపత్తిని సాధించింది. జాతీయ ప్రాధాన్యతలను పరిష్కరించే, ప్రపంచ టెలికమ్యూనికేషన్స్ రంగంలో భారత్ పోటీతత్వాన్ని పెంపొందించే ప్రభావవంతమైన సాంకేతికతలుగా పరిశోధన శ్రేష్ఠతను అనువదించడానికి సీ-డాట్ కట్టుబడి ఉంది. ఇటీవల సీ-డాట్ బెంగళూరు క్యాంపస్ లో కూడా 'వార్షిక ఐపీ అవార్డుల ప్రదానో త్సవం-2026'ను నిర్వహించారు. మేధో సంపత్తి సృష్టికి అందించిన అసాధారణమైన కృషికి గాను ఈ వేడుకలో 78 మంది ఆవిష్కర్తలను సత్కరించారు. ఈ కార్యక్రమం లో 36 పేటెంట్లు, 18 కాపీరైట్లు, 9 ట్రేడ్ మార్కులు, 3 పరిశోధన పత్రాలను గుర్తిం చారు. ఇది సంస్థ మొత్తంగా ఆవిష్కరణల లోతు, వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తుంది. ఢిల్లీ, బెంగళూరు క్యాంపస్‌లలో నిర్వహించిన ఐపీ అవార్డుల వేడుకలు రెండూ కలిసి ఆవిష్క రణలు, మేధో సంపత్తి సృష్టి, టెలికమ్యూని కేషన్స్ రంగంలో పెరుగుతున్న భారత్ నాయ కత్వానికి దోహదపడే స్వదేశీ సాంకేతికతల అభివృద్ధి పట్ల సీ-డాట్ నిరంతర నిబద్ధతను ప్రధానంగా తెలియజేస్తున్నాయి. సీ-డాట్ ఢిల్లీ క్యాంపస్‌లో అవార్డు గ్రహీతలతో పాటు సీ-డాట్ సీఈఓ డాక్టర్ రాజ్‌కుమార్ ఉపాధ్యాయ్, సీ-డాట్ కార్యనిర్వాహక వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ పంకజ్ దలేలా, ఇతర అధికారులు.

## స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఎక్స్‌ట్రీమ్ వెదర్ గ్రేడ్ డీజిలును ఆవిష్కరించిన ఆర్మీ చీఫ్

న్యూ ఢిల్లీ, ఆగష్టు 1:స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన ఎక్స్‌ట్రీమ్ వెదర్ గ్రేడ్ (ఎక్స్‌డబ్ల్యూజీ) డీజిలును సైనిక దళాల ప్రధానాధికారి (సీవోఏఎస్) జనరల్ ధీరజ్ సేథ్ ఈ రోజు న్యూఢిల్లీలో ఆవిష్కరించారు. భారత ఆర్మీ, చమురు మార్కెటింగ్ సంస్థలు సంయుక్తంగా తయారు చేసిన ఈ ప్రత్యేక ఇంధనం.. కఠినమైన వాతావరణ పరిస్థితుల్లో రక్షణ, రవాణా వాహనాల గమనాన్ని, భద్రతను, కార్యాచరణ సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది. అత్యంత ఎత్తయిన ప్రాంతాలు, అత్యంత శీతల ప్రాంతాల్లో ఈ టెక్నాలజీకి విస్తృతమైన పౌర ప్రయోజనాల ఉన్నాయి. అలాగే ఆత్మనిర్భర భారత్ దిశగా సాధించిన ముఖ్యమైన విజయాన్ని సూచిస్తుంది.

అత్యల్ప ఉష్ణోగ్రతల వద్ద సాధారణ డీజిలు చిక్కగా మారి, ఇంధన ఫిల్టర్లను మూసుకుపోయేలా చేస్తుంది. ఫలితంగా అధిక ఎత్తుల్లో, మంచు ప్రాంతాల్లో వాహనాల పనితీరు ప్రభావితమవుతుంది. ఈ సవాలును ఎక్స్‌డబ్ల్యూజీ డీజిల్ అధిగమిస్తుంది. మైనస్ 42 డిగ్రీల సెల్సియస్ లాంటి అత్యల్ప ఉష్ణోగ్రతల వద్ద సైతం ఇది ప్రభావవంతంగా పనిచేస్తుంది. బీఎస్-ఎ ప్రమాణాలు, ఐఎస్ 1460:2025 ప్రత్యేకతలకు అనుగుణంగా ఉండటంతో.. సైన్యంలో ఇప్పటికే వినియోగిస్తున్న పాత వాహనాల్లో సైతం దీనిని ఉపయోగించవచ్చు. దీనికోసం ఎలాంటి ఇంజిన్ మార్పులు లేదా రీ-హోమోలోగేషన్ అవసరం లేదు.

ఈ సందర్భంగా సీవోఏఎస్ ప్రసంగించారు. అత్యంత కఠినమైన వాతావరణ పరిస్థితుల్లో రవాణా, కార్యాచరణ సన్నద్ధత, మిషన్ విశ్వసనీయతను మెరుగుపరిచే విప్లవాత్మక స్వదేశీ ఆవిష్కరణగా ఎక్స్‌డబ్ల్యూజీ డీజిలును వర్ణించారు. తీవ్రమైన చలికాలాల్లో వాహనాలు పనిచేయడానికి గతంలో అనుసరించిన పద్ధతులను ఈ ఇంధనం తొలగిస్తుందన్నారు. తద్వారా సిబ్బంది భద్రత, మనోధైర్యం మెరుగుతుందని వెల్లడించారు. ఏడాది వ్యవధిలోనే పరిష్కారాన్ని అభివృద్ధి చేసిన భారత ఆర్మీ బృందం, చమురు మార్కెటింగ్ సంస్థలను సీవోఏఎస్ అభినందించారు. అలాగే ఈ భాగస్వామ్యం... వైవిధ్యమైన కార్యాచరణ అవసరాల కోసం ప్రత్యేకమైన ఇంధనాలను రూపొందిస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

సైనికపరమైన అవసరాలకు మాత్రమే కాకుండా... కఠినమైన వాతావరణ పరిస్థితుల్లో పనిచేసే వాహనాలు, పరికరాల విశ్వసనీయతను, భద్రతను మెరుగుపరిచి అత్యంత ఎత్తయిన, అత్యల్ప ఉష్ణోగ్రతలున్న ప్రదేశాల్లో నివసించే పౌరులకు కూడా ఈ సాంకేతిక పరిజ్ఞానం ప్రయోజనాన్ని చేకూరుస్తుంది.

## కోటగిరిలో పెద్ది సుదర్శన్ రెడ్డికి ఘనంగా నివాళులు



నిజామాబాద్, ఆగష్టు 1:తెలంగాణ ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి పోషించిన చురుకైన పాత్ర ఎప్పటికీ గుర్తుండిపోతుందని, ఆయన సేవలు చిరస్మరణీయమని నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల బీఆర్ఎస్ నాయకులు తెల్ల రవికుమార్, మోరే కిషన్, ఎత్తొండ దేవేందర్ కొనియాడారు.

శనివారం కోటగిరి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కోటగిరి మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల బీఆర్ఎస్ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు. ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు.

పెద్ది సుదర్శన్ రెడ్డి పేరే ఒక ఉత్తేజం. వరంగల్ గడ్డమీద అనేక సవాళ్లను ఎదుర్కొంటూ, ఒడిదుడుకులను అధిగమించి ప్రత్యేక పోరాట జెండాను నింగినెత్తిన ధీశాలి.. ఆర్థిక బలం లేకున్నా ఆత్మీయ బలంతో ప్రజాక్షేత్రంలో ఉద్యమ జెండాను భుజానికి ఎత్తుకున్నారన్నారు. నర్సంపేట మట్టిలో ఆయన ముద్ర చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు.

## వ్యాపారిపై హత్యాయత్నం.. భాగస్వామితో పాటు మరో ఆరుగురి అరెస్ట్



ముంబాయి, ఆగష్టు 1:మహారాష్ట్రకు చెందిన పారిశ్రామికవేత్త, జీఎస్ఎమ్ ఫాయిల్స్ కంపెనీ ఎండీ మోహన్‌సింగ్ పర్మార్ (46)పై కాల్పుల జరిగాయి. ఈ ఘటనలో గాయపడిన అతడిని ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతున్నారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు ప్రధాన నిందితుడు సాగర్ గిరీష్ భానుశాలి (33), అతడికి సహకరించినవారిని అరెస్ట్ చేశారు. సాగర్ గిరీష్ భానుశాలి పర్మార్ కంపెనీలోని తోటి భాగస్వామి అని తెలిసి పోలీసులు ఖంగు తిన్నారు.

స్టాక్ మార్కెట్‌లో భారీగా నష్టపోయిన సాగర్ గిరీష్ పర్మార్ నుంచి రూ. 32 కోట్లు తీసుకున్నాడు. పర్మార్ అప్పు ఎగ్గొట్టేందుకు, కంపెనీని చేజిక్కించుకునేందుకు పర్మార్‌ను హత్య చేయాలనుకున్నాడు. దీంతో కంపెనీ ఉన్న వసాయ్ లోని నాయక్‌పాడ ప్రాంతంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు పర్మార్‌పై కాల్పులు జరిపారు. ఒక బుల్లెట్ భుజానికి తలిగింది. మరోసారి కాల్పులు జరిపే ప్రయత్నంలో పిస్టల్ జామ్ అయ్యింది. దీంతో వారు అక్కడి నుంచి పారిపోయారు. సీసీటీ ఫుటేజీలు పరిశీలించిన పోలీసులు సాగర్, అతడికి సహకరించిన ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు.

## ప్రతి ఇంటికీ ఆరు మొక్కల పంపిణీ

నల్గొండ, ఆగష్టు 1:యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో వీబీజీ-రాంజీ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామ నర్సరీలో పెంచిన మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు.

గ్రామ సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ గ్రామ నర్సరీలో పెంచిన సుమారు పది రకాల పూలు, పండ్ల మొక్కలను ప్రతి ఇంటికి ఆరు చొప్పున ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామాన్ని పచ్చదనంతో నింపేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, పంపిణీ చేసిన మొక్కలను నాటి శ్రద్ధగా సంరక్షించాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వలందాస్ మహేష్ గౌడ్, వార్డు సభ్యులు బత్తుల అనుష మహేష్ గౌడ్, పాలెం వెంకటేశం గౌడ్, ముద్దం లింగస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ కబడ్డీ ప్లేయర్ భార్య ఆత్మహత్య

న్యూఢిల్లీ, ఆగష్టు 1:అంతర్జాతీయ కబడ్డీ ప్లేయర్ షీలూ బల్‌హరా భార్య 23 ఏళ్ల ముస్కాన్ బల్‌హరా ఆత్మహత్య చేసుకున్నది. రోహతక్ జిల్లాలోని బాహూ అక్బార్‌పుర్ గ్రామంలో ఆమె బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. ఈ ఘటన పట్ల దర్యాప్తు కొనసాగుతోందని రోహతక్ ఎస్పీ గౌరవ్ రాజ్‌పురోహిత్ తెలిపారు. కుటుంబసభ్యుల స్టేట్మెంట్ రికార్డు చేస్తున్నారు. షీలూ బల్‌హరను ప్రశ్నిస్తున్నారు. ఇప్పటి వరకు పోలీసులు ఎటువంటి ప్రకటన రిలీజ్ చేయలేదు. ముస్కాన్ కుటుంబ సభ్యులు షీలూ ఇంటి ముందు ధర్నా చేశారు.

తన కూతుర్ని వేధింపులకు గురి చేసినట్లు ఆరోపించారు. ఫోరెన్సిక్ బృందం ఆ ఇంటిని తనిఖీ చేసింది. ఆధారాలను సేకరించారు. రోహతక్‌లోని పీజీఐఎంఎస్ ఆస్పత్రికి ముస్కాన్ మృతదేహాన్ని తీసుకెళ్లారు. మెహంలోని ఫర్మానా గ్రామానికి చెందిన ముస్కాన్ 2023 డిసెంబర్‌లో షీలూను పెళ్లి చేసుకున్నది. ఆ ఇద్దరికీ 9 నెలల కుమారుడు ఉన్నాడు. షీలూ తొలుత జూడో, రెజ్లింగ్‌లో శిక్షణ పొందాడు. ఆ తర్వాత అతను తన కెరీర్‌ను కబడ్డీపై ఫోకస్ పెట్టాడు. షీలూకు 'హర్యానా ఆలా చీతా'గా పేరున్నది. కబడ్డీలో ప్రత్యర్థి ఆటగాళ్లను ఈజీగా పట్టేస్తాడు. భారత జట్టు తరపున విదేశాల్లోనూ అతను మ్యాచ్‌లు ఆడాడు. ఆత్మహత్య చేసుకోవడానికి ముందు రోజు .. ముస్కాన్ తన ఇన్‌స్టాలో ఓ పంజాబీ పాటకు చెందిన రీల్‌ను పోస్టు చేసినట్లు తెలిసింది.

## నేటి యువత సమస్యలపై చైతన్యంతో ముందుకు రావాలి..

**-గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము**

అమరావతి, ఆగష్టు 1: నేటి యువతరం సమస్యలపై చైతన్యం కలిగి ఉండడం శుభపరిణామం అని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము. గ్రామాల అభివృద్ధిలో కూడా విద్యార్థులు ఇదే చైతన్యంతో ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు.

నందివాడ మండలం ఇలపర్రు నుండి గుడివాడకు వచ్చే ఆర్టీసీ బస్సుల కొరతతో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తక్షణం స్పందించారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు శనివారం ఉదయం గుడివాడ ప్రజావేదిక కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యను విన్నవించారు.

ఇలపర్రు టు గుడివాడ రూటులో ఉదయం వేళ ఒకే సర్వీస్ ఉండటంతో బస్సులో నిలబడేందుకు కూడా స్థలం లేకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని స్టాపుల్లో బస్సులు ఆపకపోవడంతో కాలేజీలకు సమయానికి వెళ్లలేకపోతున్నామని వాపోయారు. గతంలో డిపో అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు.

విద్యార్థుల సమస్యను సావధానంగా విన్న ఎమ్మెల్యే రాము వెంటనే ఆర్టీసీ ఆర్ఎం తో ఫోన్ లో మాట్లాడారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా ఇలపర్రు రూటులో స్టూడెంట్స్ స్పెషల్ సర్వీస్ నడపాలని, లేదా ఉదయం, సాయంత్రం రెండు సర్వీసులు పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము విద్యార్థులతో మాట్లాడుతూ "రద్దీగా ఉన్న ఆ బస్సులో ప్రయాణించేది కూడా మీ కుటుంబ సభ్యులే అనే విషయాన్ని గుర్తించాలన్నారు. మీరు లేవనెత్తిన సమస్యను వారం రోజుల్లో పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. ఇంత చైతన్యవంతంగా సమస్యపై స్పందించిన విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ చైతన్యం కేవలం బస్సు సమ స్యకే కాదు గ్రామంలో పరిశుభ్రత, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాల్లో కూడా ఉండాలన్నారు. గ్రామస్తులకు కూడా మీరు అవగాహన కల్పించాలి" అని సూచించారు.

ఎప్పుడు ఏ సమస్య వచ్చినా నేరుగా తనను గానీ, అధికారులను గానీ సంప్రదించి పరిష్కరించుకోవాలని, బాగా చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని ఎమ్మెల్యే రాము విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం విద్యార్థులు ఎమ్మెల్యే రాముకు వినతి పత్రం అందజేశారు. విద్యార్థుల సమస్యపై తక్షణం స్పందించిన ఎమ్మెల్యే చర్యలపై విద్యార్థుహర్షం వ్యక్తం చేశారు.



# జయహో! "ఉజ్జయిని మహాంకాళి"

## బోనాల పండుగ ప్రస్తావన:

బోనాలు హైందవ సంస్కృతిలో తెలంగాణ ప్రాంతవాసులు భక్తి శ్రద్ధలతో జరుపుకునే పండుగ, సికింద్రాబాద్ ఉజ్జయిని మహాంకాళి దేవతను సేవించటానికి, హైదరాబాద్, సికింద్రాబాద్ నలుమూలల నుండి జనం తండోపతండాలు తరలివచ్చి మహాంకాళి అమ్మవారికి బోనం సమర్పించి పండుగను ఘనంగా జరుపుకుంటారు. ఆషాడమాసంలో వర్షాల కారణంగా అంటువ్యాధులు విజృంభిస్తాయి. నీటిలో జీవించే క్రిమికీటకాలు వ్యాప్తి చెందుతాయి. ఈ వ్యాధుల నుంచి కాపాడి ఆరోగ్యాన్ని ప్రసాదించమ్మా అంటూ గ్రామదేవతలను ఆరాధిస్తారు. వేపాకులు, పసుపు నీళ్లు క్రిమికీటకాలను తరిమికొడతాయని తెలంగాణా ప్రాంతలో, భక్తుల విశ్వాసంతో జరుపుకునే బోనాల పండుగ జాతర కోలాహలంగా ప్రారంభం అయింది. ఆషాడ మాసంలో గ్రామ దేవతలుగా ఆరాధించే అమ్మవారు తన పుట్టింటికి వెళుతుందని భక్తులు విశ్వాసం... అందుకే అమ్మను తమ ఇంటి ఆడబిడ్డలా భావించి భక్తి శ్రద్ధలతో పూజించి నైవేద్యాలు సమర్పిస్తారు. బోనాల పండుగ ప్రారంభించే సమయంలో దుష్టశక్తులను తరిమేందుకు అనాదిగా ఆనవాయితీని అనుసరించే కొందరు భక్తులు కోడి పుంజులను బలి ఇవ్వడం గమనార్హం. బోనాలు తీసుకెళ్ళే మహిళలపై అమ్మవారు ఉంటుందని భక్తుల నమ్మకం. అందుకే బోనంపట్టుకున్న మహిళలు ఆలయాన్ని సమీపించగానే పాదాలపై నీళ్లచల్లి నమస్కరిస్తారు. హైదరాబాదులోని జగదాంబిక అమ్మవారి ఆలయం మొదటి బోనం, రెండో బోనం బల్కంపేట రేణుక ఎల్లమ్మ గుడిలో, మూడో



బోనం సికింద్రాబాదులోని ఉజ్జయిని మహాంకాళి ఆలయాలలో సమర్పించడం సంప్రదాయంగా వస్తున్న పేర్కొనవచ్చు.

## బోనాలు పండుగ ప్రాముఖ్యత:

బోనాలు పండుగ ప్రతి ఏడాది ఈ పండుగను జరుపుకోనేందుకు చరిత్ర లోకి వెళితే... బోనాలు పండుగ చరిత్ర 1813లో హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో ప్లేగు వ్యాధి వ్యాప్తి చెందడంతో వేలాది మంది ప్రాణాలు కోల్పోతుంటే పైనిక బెటాలియన్లు ఉజ్జయిన్లు మోహరించారు. హైదరాబాద్లో ప్లేగు వ్యాధి మరింతగా వ్యాప్తి చెందడంతో ప్రజలు ఆందోళన చెందుతున్న క్రమంలో, ఆ పరిస్థితుల్లో మిలిటరీ బెటాలియన్ మధ్యప్రదేశ్లోని ఉజ్జయిని మహాకాళి ఆలయంలోని మాతృదేవతకు ప్రార్ధనలు చేసి, ప్రజల అంటువ్యాధుల నుండి విముక్తి పొందడం కొరకు మహాంకాళి విగ్రహాన్ని సికింద్రాబాద్ మోండా మార్కెట్ గా ప్రసిద్ధిచెందిన ఆ ప్రదేశంలో ఉన్న దేవాలయంలో ఉజ్జయిని మహాంకాళిని ప్రతిష్టించడంతో, నాటినుండి ఆంటనగరాల నలుమూలల నుండి భక్తులు అశేషంగా కదలివచ్చి మహాంకాళి అమ్మవారికి బోనాలు సమర్పించడంతో ప్లేగు వ్యాధి నుండి విముక్తి పొందినట్లుగా చెప్పుకుంటారు. ప్రజలు ఆనాటి నుండి ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో మహంకాళికి బోనాలు సమర్పించడం అనవాయితీగా వస్తున్న సంప్రదాయంగా పేర్కొనవచ్చు. అదేవిధంగా మరొక సంఘటన 1860లోనూ జంట నగరాలలో మలేరియా ప్రబలడంతో తీవ్ర ప్రాణనష్టం సంభవించిన దరిమిలా, ఆనాడు సైతం మహంకాళి అమ్మవారిని ప్రసన్నం చేసుకొనే పేరిట తొలి బోనాల జాతర నిర్వహిం చారు. తరువాత నిజాం నవాబు కూడా ఈ ఉత్సవాలు అధికారికంగా నిర్వహించేందుకు ఉత్తర్వులు ఇవ్వడం తద్వారా ఇప్పటికి, ఆషాఢ బోనాల



పండగ అంటే వీధి వీధిలో కొలు వై ఉన్న గ్రామదేవత అమ్మవార్లని పూజించే అనవాయితీ అంగరంగ వైభవంగా కొనసాగుతూ వస్తోంది. బోనం అంటే భోజనం దీన్ని కొత్తకుండలో వండి. ఇంటిల్లిపాది డప్పువాద్యాలతో ప్రదర్శనగా వెళ్లి ప్రతివీధిలో ఉన్న గ్రామదేవతలకు మొక్కుబడులను సమర్పించుకుంటారు. వ్యాధి నిరోధకశక్తిని పెంచే పసుపు కలిపిన నీరు, వేపాకుల్ని చల్లుకుంటూ భక్తులు ఊరేగింపుగా గ్రామదేవతల ఆలయాలకు తరలివెళ్లి బోనాలు సమర్పిస్తారు. ఇలా బోనాల సమర్పణ వల్ల దేవతలు శాంతించి. అంటువ్యాధులు రాకుండా కాపాడుతారని ప్రజల ప్రగాఢ విశ్వాసం, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత బోనాలను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నారు.

## గ్రామదేవతకు సమర్పించే నైవేద్యం:

తెలంగాణ ప్రాంతంలోని ప్రజలు భక్తి శ్రద్ధలలో ఈ పండుగను బహువిష్టతో, విశ్వాసంతో జరుపుకునే ఈ పండుగ ఉదయాన్నే లేచి, స్నానంచేసి, కొత్తబట్టలు ధరిస్తారు. స్త్రీలు, కొత్త మట్టి కుండలను కొని, దానిని కడిగి, అందులో అన్నం, పెరుగు, నీరు మరియు బెల్లం కలిపి ఉడికించాలి. కుండ ఎరుపు, తెలుపు మరియు పసుపు రంగుల తో అలంకరిం చబ డుతుంది. కుండలపై పసుపు, కుంకుమ, వేపాకులు, దీపంతో అలంకరిస్తారు. ఈ కుండ అమ్మవారికి సమర్పించే నైవేద్యం. స్త్రీలు వారి సాంప్రదాయాన్ని అనుసరించి వారి వారి శక్త్యానుసారం వండిన అన్నంతో పాటు పాలు, పెరుగు, బెల్లం, కొన్నిసార్లు ఉల్లిపాయలతో కూడిన బోవాన్ని ముట్టి, ఇత్తడి లేక రాగి కుండలలో తమ తలపై పెట్టుకుని, డప్పు, ఆటగా ళ్ళు తోడ్కొని రాగా దేవి గుడికి వెళ్తారు. మైనమ్మ, పోచమ్మ, ఎల్లమ్మ, పెద్దమ్మ, డొక్కాలమ్మ, అంకాలమ్మ, పోలేరమ్మ, మారెమ్మ మున్నగు పేర్లు కల ఈ దేవీ, దేవతల గుళ్ళను రేదీప్యమానంగా అలంకరించిన అమ్మవార్లకు బోనం నైవేద్యంగా బోనం సమర్పిస్తారు.

## పోతురాజు వీరంగం:

బోనాల సందర్భంగా దేవీ సోదరుడుగా పోతురాజు వేషదారి, పాత్రను పోషించే వ్యక్తి స్పురద్రూపిగా బలశాలిగా ఉంటారు. ఒంటిపై పసుపు, నుదుటిపై కుంకుమ, కాలికి గజ్జెలు కలిగి, చిన్న ఎర్రని ధోతీని ధరించి డప్పు వాయిద్యానికి అనుగుణంగా అడతాడు. పోతురాజు, మాతృదేవత యొక్క సోదరుడిగా పరిగణించబడతాడు. బోనాల పండుగలో పోతరాజుల విన్యాసాలు, రంగం లాంటివి ప్రత్యేకంగా ఆకట్టుకుంటూ (ఆషాడ) మానంలో దేవికొలువై ఉన్న ఆలయాలకు వెళ్ళడానికి కారణమేమంటే దేవి తన పుట్టింటికి వెళుతుందని నమ్మకం, అందుకే భక్తులు ఈ పండుగ సమయంలో దేవిని దర్శించుకుని తమ స్వంత కూతురు తమ ఇంటికి వచ్చిన భావనతో భక్తి శ్రద్ధలతోనేగాక ప్రేమానురాగాలతో బోనాలను ఆహార నైవేద్యంగా సమర్పిస్తారు. ఈ తంతును ఊరడి అంటారు. పొట్టేళ్ళ రథంపై అమ్మవారి ఊరేగింపు చేస్తారు. పూర్వకాలంలో ఈ పండుగ రోజున దుష్టశక్తులను పారద్రోలటానికి ఆలయ ప్రాంగణంలో గతంలో జంతు బలి ఇచ్చేవారు. నేడు బదులుగా కోడిపుంజులను బలిఇవ్వడం ఆనవాయితీగా మారింది.

## రంగం:

బోనాల పండుగ సంబరాలు గోల్కొండ కోటలోని శ్రీ జగదాంబ ఆలయం వద్ద ప్రారంభం కావడంతో, లష్కర్ బోనాలుగా పిలువబడే సికింద్రాబాదులోని ఉజ్జయిని మహంకాళి ఆలయము, సికింద్రాబాద్ మోండా మార్కెట్లో కొలువైయున్న ఉజ్జయిని మహాంకాళి ఆలయంలో సమర్పించిన బోనం దైవ ప్రసాదాన్ని ఇంటిల్లిపాది, కుటుంబసభ్యులతో అతిథులతో పంచుకుంటూ విందు ఆరగిస్తారు. బల్యంపేట్లోని ఎల్లమ్మ దేవాలయాల మీదుగా సిటీ ప్రాంతానికి చేరుకుంటుంది. ఆషాడ మాసం బిలకలగూడలోని పోచమ్మ. కట్టమైనమ్మ దేవాలయం, చివరిగా హైదరాబాద్ పాతబస్తీ, లాల్ దర్వాజలోని మాతేశ్వరి ఆలయంలో పూజలు నిర్వహిస్తారు. ఆ మరుసటి ఆదివారాలలో హైదరాబాద్, సికింద్రాబాద్లో కొలువైయున్న గ్రామదేవతల ఆలయాలలో అలంకరించిన దేవికి వీధివీధిలో ఉన్న ప్రజలు తమ ఇంటివద్దనే కొలువైయున్న ఆలయాలకు తరలివెళ్ళి దేవికి మొక్కుబడులు, బోనం సమర్పించి ఆ ప్రసాదాన్ని ఆరగించి అమ్మదయకు పాత్రులవుతారు. ఈ విధంగా తెలంగాణప్రాంతంలో ఉన్న గ్రామదేవతల ఆలయాల్లో సంప్రదాయం ప్రకారం బోనాలు సమర్పించడం అనవాయితీగా వస్తున్న సాంప్రదాయం. పండుగ మరుసటి రోజు ఉదయం తర్వాత రంగం, ఒక స్త్రీ 'పై మహాంకాళి దేవత ఆవహించిన అమ్మవారిని భవిష్యత్తు గురించి అడుగుతుంటారు. (భవిష్యవాణి) ఆ సంవత్సరంలో జరగబోయే కష్టసుఖాలు చెప్పడం, చెప్పినప్రకారం జరుగుతుండడం అనవాయితీగా వస్తున్న ఆధారంగా భక్తుల విశ్వసించడం పరిపాటైంది. అమ్మవారు పలకబోయే భవిష్యత్ ప్రణాళిక వినటానికి జనాలు తండోప తండాలుగా తరలిరావడం విశేషం.



## ఘటం అమ్మవారి ఊరేగింపు:

బోనాల పండుగలో ముఖ్యమైన ఘటం అమ్మవారి ఊరేగింపు సమయంలో అమ్మవారి రథం ముందు డప్పుల మేళం తో పోతరాజుల విన్యాసాలు, వేపాకులతో పాటు, గుగ్గిలం పొగ వేస్తారు. ఊరేగింపు సమయంలో అమ్మవారికి గుగ్గిలం పొగ వేస్తారు. వర్షాకాలంలో వ్యాప్తిచెందే దోమలు, ఇతర క్రిమికిటకాల నుండి క్రిమికీటకాదులు నశిస్తాయి. హరిబౌలిలోని అక్కన్న సదన్నా ఆలయానికి చెందిన ఘటం ఊరేగింపుకు నాయకత్వం వహిస్తుంది.

ఇంటనగరాల్లోని మహంకాళి, ఇంకా ఇతర ప్రసిద్ధ దేవాలయాల నుండి ఘటములు ఊరేగింపుగా చేరి, ఇక్కడ సమావేశమవుతారు.

ఈ ఘటముల ఊరేగింపు అందంగా ఆకర్షణీయంగా భక్తుల హృదయాలను ఆకట్టుకునే విధంగా ఉండటంతో భక్తులు సమూహంగా తరలి వచ్చి ఊరేగింపు వెంట సాగుతూ కోలాహలంగా సంబరాలు అరుపుకుంటారు. చివరగా నయాపూల్ వద్ద ఘటం నిమజ్జనంతో బోనాల పండుగ ముగుస్తుంది. ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు తావు ఇవ్వని రీతిలో బోనాల పండుగ జాతరను ఆనందంగా జరుపుకుందాం.

శుభం భూయాత్
సర్వే జనాః సుఖినో భవంతు




-శారద శృంగేరి
9490 26 1119

---

## శాత్రాజుపల్లి (ఇందిరానగర్) అంగన్వాడి సెంటర్ను సందర్శించిన జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 1:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని ఐసిడిఎస్ వేములవాడ అర్బన్ సెక్టార్ సమావేశం శాత్రాజుపల్లి ఇందిరానగర్ అంగన్వాడి సెంటర్ ను జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి ఆగష్టు 1-7 వరకు అన్ని కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమాలను నిర్వహించాలని, ప్రీస్కూలు పిల్లల హాజరు శాతం పెంచుకోవాలని, వర్షాకాలం కాబట్టి సెంటర్ చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఫుడ్ స్టాకు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని వివరించడం జరిగింది. ఈ సెక్టార్ మీటింగ్ లో సిడిపిఓ సౌందర్య సూపర్వైజర్ అంజమ్మ అర్బన్ సెక్టార్ పరిధి లో అందరు అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.




## జిల్లా పరిధిలో పోలీస్ యాక్ట్ అమలు:జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 1:(నేటినిజం ప్రతినిధి): శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం నెల రోజుల (ఆగస్ట్ 1వ తేది నుండి 31 వరకు) పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు.దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు,రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలిలు, పబ్లిక్ మీటింగ్ లు,సభలు, సమావేశాలు నిర్వహించరదాని,నిబంధనలకు విరుద్దిదంగా డి.జె వినియోగించారాదని తెలిపారు. శాతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు.కాబట్టి జిల్లా ప్రజలు పోలీసు వారికి ఇట్టి విషయంలో సహకరించాలని శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.

## కరీంనగర్లో కళాకారుల ఆధ్వర్యంలో ఘనంగా బోనాల జాతర...

### -గోడపత్రిక ఆవిష్కరణ



కరీంనగర్, ఆగష్టు 1: (నేటినిజం ప్రతినిధి), ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని కరీంనగర్ నగరంలో కళాకారుల ఆధ్వర్యంలో వైభవంగా బోనాల జాతర నిర్వహించనున్నారు. ఈ నెల 5వ తేదీ, బుధవారం రోజున జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్ నుంచి కోతీరాంపూర్ పోచమ్మ ఆలయం వరకు ఈ జాతర కార్యక్రమం అత్యంత వైభవంగా సాగనుంది.ఈ జాతర కార్యక్రమానికి సంబంధించి కళాకారులు శనివారం కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేకంగా ఆహ్వానించారు. అనంతరం జాతరకు సంబంధించిన గోడపత్రికల ను వారి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాకారుల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఈ వేడుకలను ఘనంగా నిర్వహించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలోమాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తో పాటు బిఆర్ఎస్ నగర అధ్యక్షులు చల్ల హరి శంకర్,మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి,?కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ - శ్రీనివాస్,మాజీ కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్,కళాకారులు గోగుల ప్రసాద్,సంద స్వప్న పలువురు బీఆర్ఎస్ నాయకులు, మరియు కళాకారులు తదితరులు ఉన్నారు.

## రాష్ట్రంలోనే తొలి ఉచిత 2డీ ఎకో స్కానింగ్ కేంద్రం ఏర్పాటు..

### -ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ సుజనా చౌదరి

అమరావతి, ఆగష్టు 1: గర్భిణీ స్త్రీలు, గర్భస్థ శిశువుల ఆరోగ్య సంరక్షణలో మరో వినూత్న అడుగు పడింది. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే, మాజీ కేంద్ర మంత్రి యలమంచిలి సత్యనారాయణ (సుజనా) చౌదరి నాయకత్వంలో సుజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోనే తొలిసారిగా గర్భిణీల కోసం ఉచిత 2డీ ఎకో స్కానింగ్ కేంద్రం ప్రారంభమైంది. గర్భిణీలకు అత్యాధునిక వైద్య పరీక్షలను పూర్తిగా ఉచితంగా అందుబాటులోకి తీసుకువస్తూ ప్రారంభించిన ఈ సేవలు మాతా,శిశు ఆరోగ్య రక్షణలో కీలక మైలురాయిగా నిలవనున్నాయి.

గర్భిణీ స్త్రీలకు ఎంతో ఉపయోగకరం..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ, గర్భధారణ అనేది వ్యాధి కాదని, అయితే గర్భధారణ సమయంలో తల్లి, గర్భస్థ శిశువులో ఏర్పడే గుండె సంబంధిత లోపాలు, ఇతర ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించడం అత్యంత అవసరమని చెప్పారు. అందుకే 2డీ ఎకో స్కానింగ్ సేవలను ప్రతి గర్భిణీకి ఉచితంగా అందించేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ప్రారంభమైన రోజునే ఈ సేవలను ప్రారంభించడం మరింత సంతోషంగా ఉందన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో ప్రస్తుతం గుర్తించిన సుమారు 550 మంది గర్భిణీలకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయని ఆయన వెల్లడించారు.

గర్భిణీల్లో వచ్చే గుండె స్పందనలో మార్పులు, పుట్టబోయే శిశువులో గుండె సంబంధిత లోపాలను ముందుగానే గుర్తించడం ద్వారా అవసరమైన వైద్య చికిత్స, జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యవంతమైన ప్రసవాలకు మార్గం సుగమం అవుతుందని వివరించారు. తల్లి, బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆనందంగా ఉంటుందని, అదే సమాజాభివృద్ధికి పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు పూర్తవుతున్నప్పటికీ ప్రతి గర్భిణీకి ఇలాంటి కీలక వైద్య పరీక్షలు అందుబాటులో లేకపోవడం బాధాకరమని సుజనా చౌదరి అన్నారు.విద్య, వైద్యం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యతలేనని, అయితే ప్రభుత్వానికి తోడుగా సేవా సంస్థలు కూడా ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. అదే సామాజిక బాధ్యతతో సుజన ఫౌండేషన్ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని చెప్పారు. ఎన్నికల వరకు మాత్రమే రాజకీయాలు ఉంటాయని, ఎన్నికల అనంతరం ప్రజాప్రతినిధి ప్రతి ఒక్కరికీ సమానంగా సేవ చేయాల్సిన బాధ్యత ఉందని ఆయన స్పష్టం చేశారు. ఓటు వేశారా లేదా, ఏ పార్టీకి చెందిన వారైనా, ధనికపేద అనే తేడా లేకుండా ప్రతి గర్భిణీ ఈ ఉచిత సేవలను వినియోగించుకోవాలని కోరారు. పశ్చిమ నియోజకవర్గాన్ని ప్రజా ఆరోగ్యం, సంక్షేమం, వినూత్న సేవల్లో రాష్ట్రానికి ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ మాట్లాడుతూ, ప్రభుత్వాసుపత్రుల్లో మాత్రమే ఎక్కువగా అందుబాటులో ఉండే 2డీ ఎకో స్కానింగ్ సేవలను ఉచితంగా ప్రజలకు అందించడం అభినందనీయమన్నారు. గర్భస్థ శిశువులో లోపాలను ముందుగానే గుర్తించి మాతా,శిశు మరణాల తగ్గింపులో ఈ సేవలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. ఈ నమూనాను జిల్లాలోని ఇతర నియోజకవర్గాలకు, గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరించేలా సుజన ఫౌండేషన్ సహకరించాలని కోరారు.ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం లు అవసరమైన గర్భిణీలను గుర్తించి ఈ సేవలను పూర్తిస్థాయిలో వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జి బుద్ధ వెంకన్న, కృష్ణాజిల్లా గ్రంధాల యాల చైర్మన్ ఎంఎస్ బేగ్, నాగుల్ మీరా తో పాటు బిజెపి జనసేన పార్టీకి చెందిన నాయకులు కార్యకర్తలు , సుజనా మిత్రాలు పాల్గొన్నారు.

## నేరాల నియాత్రణకు గ్రామాల్లో విజిబుల్ పొలిసింగ్ పై దృష్టి సారించాలి.

### ప్రజలకు మరింత చేరువగా పోలీస్ విధులు ఉండాలి.-జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే..

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 1:(నేటినిజం ప్రతినిధి): నేరాల నియంత్రణే లక్ష్యంగా గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ మరింత సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువయ్యేలా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అధికారులకు సూచించారు.శనివారం వార్షిక తనిఖీల్లో భాగంగా వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్ను తనిఖీ చేశారు.ఈసందర్భంగా ఎస్పీ పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించి వారు ప్రదర్శించిన ఫుట్ డ్రిల్, లాఠీ డ్రిల్ను పరిశీలించి అభినందించారు. ఈసందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు,పెట్రోలింగ్ నిర్వహణ, రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిఘా తదితర అంశాలను క్షుణ్ణంగా సమీక్షించి, ప్రజలకు అందిస్తున్న పోలీసు సేవలపై ప్రత్యేకంగా ఆరా తీశారు.ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా పోలీసు అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అధికారులను ఆదేశించారు.కేసుల విచారణలో త్వరగతిన దర్యాప్తు,సాక్ష్యాల సేకరణలో నిష్పక్షపాత దృక్పథం అవసరమని తెలిపారు.పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పనితీరు భేషుగ్గా ఉందని అభినందించారు.విజిబుల్ పోలీసింగ్లో భాగంగా అధికారులు, విపివోలు గ్రామాల్లో పర్యటిస్తూ ఎలాంటి సంఘటన జరిగినా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం చేరేలా సమాచార వ్యవస్థను పటిష్ఠం చేయాలని సూచించారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.